**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759



RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందరి హక్కు...

PEN SATTA Telugu Daily





సంపుటి : 3 | సంచిక : 294 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | మంగళవారం 17 మార్చి 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool




## పొట్టి శ్రీరాములు ట్రస్ట్ సభ్యులకు నారా లోకేశ్ ఆత్మీయ విందు...

- ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అన్నివిధాలా మద్దతుగా ఉంటుందని మంత్రి లోకేశ్ హామీ
- పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, మెమోరియల్ ట్రస్ట్ సభ్యులకు ఆత్మీయ విందు
- రికార్డ్ సమయంలో విగ్రహ నిర్మాణం పూర్తి చేసిన ట్రస్ట్‌ను అభినందించిన మంత్రి
- 12 నెలల్లో స్మృతివనం, మ్యూజియం పనులు పూర్తి చేయాలని లక్ష్యం
- 2047 నాటికి ఏపీని 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామన్న లోకేశ్

రాష్ట్రంలోని ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అన్ని విధాలా మద్దతుగా నిలుస్తుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ భరోసా ఇచ్చారు. అమరజీవి పొట్టి శ్రీరాములు కుటుంబ సభ్యులు, మెమోరియల్ ట్రస్ట్ సభ్యులకు ఇచ్చిన ఆత్మీయ విందులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమరావతిలోని శాఖమూరు పార్క్‌లో 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' పేరుతో 58 అడుగుల పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం, సోమవారం రాత్రి ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రి లోకేశ్ ఈ విందును ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ, "అమరజీవి త్యాగశిల్పం చాలా బాగుంది, ఎంతో కళగా ఉంది. అందరం కలిసికట్టుగా పనిచేస్తే అద్భుతాలు సృష్టించవచ్చని నిరూపించారు" అని కొనియాడారు. కేవలం 194 రోజుల్లోనే జెట్ స్పీడ్‌తో విగ్రహ ఏర్పాటును పూర్తి చేసినందుకు పొట్టి శ్రీరాములు మెమోరియల్ ట్రస్ట్ సభ్యులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

- మిగతా 2లో

## మోదీ చేతిలో కీలుబొమ్మల్లా రాష్ట్ర నాయకులు

### వీబీ జీ రామ్‌జీతో పేదలకు తీరని నష్టం

### శ్రీకాకుళం పర్యటనలో వైఎస్ షర్మిల




భాజపా అంటే బాబు, జగన్, పవన్ పార్టీగా మారిందని.. వారంతా ప్రధాని మోదీ చేతిలో కీలుబొమ్మలుగా తయారయ్యారని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల విమర్శించారు. ఉపాధి హామీ పరిరక్షణ యాత్రలో భాగంగా సోమవారం శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో

- మిగతా 2లో





## విజయవాడలో ఇఫ్తార్ విందుకు హాజరైన సీఎం చంద్రబాబు...

- ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన ముఖ్యమంత్రి
- వక్ఫ్ ఆస్తులను కాపాడతామని, ముస్లింల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని హామీ
- గత 21 నెలల్లో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించిన చంద్రబాబు



పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున విజయవాడలోని ఏ ప్లస్ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ముస్లింల సంక్షేమానికి, అభివృద్ధికి తమ ప్రభుత్వం కట్టుబడి

- మిగతా 2లో



## రాష్ట్రంలో ఎల్పీజీ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

- ఇరాన్ యుద్ధ ప్రభావం నేపథ్యంలో ఎల్పీజీ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష
- ప్రజలు ఆందోళన చెందవద్దు, గ్యాస్ కొరత లేదని భరోసా
- బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని అధికారులకు కీలక ఆదేశాలు
- రాష్ట్రంలో 17,209 మెట్రిక్ టన్నుల గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని వెల్లడి
- ఏపీ, తెలంగాణ, కర్ణాటకకు కేంద్రం నుంచి అదనపు ఎల్పీజీ కేటాయింపులు

- మిగతా 2లో



## రాజ్యసభకు నితిన్, నీతీశ్ ఎన్నిక

- బిహార్‌లో 5 సీట్లూ గెలుచుకున్న ఎన్డీయే
- ఒడిశాలో క్రాస్ ఓటింగ్‌తో మూడోదీ కైవసం

భాజపా అధ్యక్షుడు నితిన్ నబీన్, బిహార్ ముఖ్యమంత్రి, జేడీయూ అధినేత నీతీశ్ కుమార్‌లు రాజ్యసభకు ఎన్నికయ్యారు. వారితోపాటు మరో ముగ్గురు బిహార్ నుంచి రాజ్యసభకు వెళ్తున్నారు. ఒడిశాలో క్రాస్ ఓటింగ్ ద్వారా మూడో స్థానాన్నీ ఎన్డీయే గెలుచుకుంది. హరియాణాలో కౌంటింగ్ నిలిచిపోయింది. దీంతో అక్కడి 2 స్థానాలకు జరిగిన ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. బిహార్ నుంచి రాజ్యసభకు ఎన్నికైన వారిలో నితిన్,

- మిగతా 2లో



## వాణిజ్య సంబంధాలు దెబ్బతింటాయ్

- ట్రంప్ తాజా సుంకాలపై చైనా హెచ్చరిక
- పారిస్‌లో ముగిసిన చర్చలు
- ట్రంప్ చైనా పర్యటనపై సందిగ్ధం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన తాజా సుంకాలు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలను దెబ్బతీస్తాయని చైనా హెచ్చరించింది. గతంలో ట్రంప్ విధించిన సుంకాలను అమెరికా సుప్రీం కోర్టు రద్దు చేసిన

- మిగతా 2లో




## భారత్‌కు చేరుకున్న 'శివాలిక్'

### నేడు 'జగ్ లడ్కీ' రాక

దిల్లీ: పశ్చిమాసియా ఉద్రిక్తతల వేళ దేశంలో ఇంధన సరఫరాపై ఆందోళన నెలకొన్న తరుణంలో కీలక పరిణామం చోటుచేసు

- మిగతా 2లో

## పొట్టి శ్రీరాములు గురించి గాంధీ వ్యాఖ్యలను గుర్తు చేసిన పవన్ కల్యాణ్

- అమరావతిలో పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు, పవన్
- ఇలాంటి మహనీయుల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందన్న పవన్
- విగ్రహం ఏర్పాటు చేసినందుకు సీఎంకు ధన్యవాదాలు
- కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు



అమరావతిలో అమరజీవి పొట్టి శ్రీరాములు భారీ విగ్రహావిష్కరణ వేడుక తెలుగు వారి ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచింది. ఈ విగ్రహాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ...

"శ్రీరాములు లాంటి వారు 11 మంది ఉంటే చాలు, ఒక ఏడాదిలోనే దేశానికి

- మిగతా 2లో




## ఇకపై ఈ త్యాగమూర్తి విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నిలుస్తుంది

- అమరావతిలో 58 అడుగుల పొట్టి శ్రీరాములు విగ్రహం ఆవిష్కరణ
- విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నామకరణం చేసిన సీఎం
- అమరజీవి త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపు
- అమరావతి రైతుల త్యాగాన్ని స్మరించుకున్న ముఖ్యమంత్రి
- ఆర్యవైశ్యులకు పలు కీలక హామీలు ఇచ్చిన చంద్రబాబు

- మిగతా 2లో



## మీతో కలిసి రాలేం

- హర్మూజ్ ప్రాంతానికి యుద్ధ నౌకలను పంపలేం
- ట్రంప్‌నకు షాకిచ్చిన మిత్ర దేశాలు
- ఆ యుద్ధంతో నాటోకు సంబంధం లేదన్న జర్మనీ
- బ్రిటన్, జపాన్‌దీ అదే వైఖరి
- పర్షియన్ గల్ఫ్‌లో రవాణాపై ఇరాన్ పట్టుతో ఆందోళన తీవ్రం
- టెహ్రాన్, బీరుట్‌లపై బాంబుల వర్షం
- దుబాయ్ విమానాశ్రయంపై దాడి
- తెరిచిన వెంటనే మూసివేత

అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ యుద్ధం తీవ్రమవుతుండటంతో చమురుపై ఆందోళనలు పెరుగుతున్నాయి. పర్షియన్ గల్ఫ్‌లో చమురు నౌకల రవాణాపై ఇరాన్ పట్టు సాధించడంతో ఇంధన సంక్షోభం, తద్వారా ఆర్థిక సంక్షోభం భయాలు చుట్టుముడుతున్నాయి. ఈ నేపథ్యంలో బలప్రయోగం

- మిగతా 2లో



## పశ్చిమాసియాలో ఘర్షణలు.. 5,500కు పైగా విమానాల రద్దు

దిల్లీ: ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడులు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో భారత్ నుంచి ఇప్పటివరకు 5,500కు పైగా విమానాలు రద్దయినట్లు

- మిగతా 2లో

## అఫ్ఘానిస్థాన్‌లో పాక్ దాడులు.. 200 మంది మృతి!



కాబుల్: అఫ్గానిస్థాన్‌లో పాకిస్థాన్ వైమానిక దాడులకు దిగింది. కాబుల్‌లో ఓ ఆస్పత్రిపై పాక్ దాడి చేయడంతో 200 మంది మృతి చెందినట్లు అఫ్గాన్ ప్రభుత్వం వెల్లడించింది. ఈ ఆస్పత్రిలో డ్రగ్స్‌కు బానిసైన వారికి చికిత్స అందిస్తున్నారు. అయితే, పాకిస్థాన్ మాత్రం అఫ్గాన్ పౌరులపై తాము ఎలాంటి దాడులు చేయలేదని పేర్కొంది. ఆస్పత్రులను తాము లక్ష్యంగా చేసుకోలేదంటూ ఆరోపణలను ఖండించింది.

# రాష్ట్రంలో ఎల్పీజీ విషయంలో ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

ఇరాన్ యుద్ధ ప్రభావం నేపథ్యంలో రాష్ట్రంలో వంటగ్యాస్ (ఎల్పీజీ) సరఫరా, నిల్వల పరిస్థితిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అమరావతి నుంచి ఆర్టీజీఎస్ ద్వారా వివిధ గ్యాస్ సరఫరా కంపెనీల ప్రతినిధులు, ఉన్నతాధికారులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎల్పీజీ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆయన భరోసా ఇచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్, ఐఓసీఎల్‌లకు చెందిన 1,154 ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతోందని, 17,209 మెట్రిక్ టన్నుల ఎల్పీజీ స్టాక్ అందుబాటులో ఉందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఎల్పీజీ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్యాస్ డెలివరీ సమయంలో సిలిండర్ల దుర్వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలని, వినియోగదారులకు సకాలంలో సిలిండర్లు అందేలా చూడాలని స్పష్టం చేశారు. సిలిండర్ సరఫరా సమయాన్ని తిరిగి సాధారణ స్థితికి తీసుకురావాలని సూచించారు. అన్న క్యాంటీన్ల కిచెన్లకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేవని అధికారులు తెలపగా.. ఆసుపత్రులు, పాఠశాలలు, దేవాలయాల్లో రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం కలగకుండా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్పీజీ వినియోగాన్ని తగ్గించే దిశగా హోటళ్ల అసోసియేషన్లతో సంప్రదింపులు జరపాలని సూచించారు. త్వరలోనే ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు కేంద్రం నుంచి అదనపు ఎల్పీజీ కేటాయింపులు

జరగనున్నట్లు అధికారులు వెల్లడించారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఎల్పీజీకి ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ గ్యాస్, ఇండక్షన్ స్టవ్‌ల వాడకాన్ని ప్రోత్సహించే అంశాన్ని పరిశీలించాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. ఇకపై రాష్ట్రంలోని ఎల్పీజీ నిల్వలు, బుకింగ్‌లు, సరఫరాపై ప్రతిరోజూ పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.

# ఇకపై ఈ త్యాగమూర్తి విగ్రహం 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్'గా నిలుస్తుంది

తెలుగు జాతి ఆత్మగౌరవం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు స్ఫూర్తితో నవ్యాంధ్ర ప్రదేశ్ రాజధాని అమరావతిని ప్రపంచస్థాయిలో నిర్మించి తీరుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణమైన పొట్టి శ్రీరాములు 125వ జయంతి సందర్భంగా, ఆయన 58 రోజుల నిరాహారదీక్షకు గుర్తుగా అమరావతిలోని శాఖమూరు పార్కులో ఏర్పాటు చేసిన 58 అడుగుల భారీ విగ్రహాన్ని చంద్రబాబు సోమవారం ఆవిష్కరించారు. ఈ విగ్రహానికి 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' (త్యాగనిరతికి ప్రతీక) అని నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు టీజీ భరత్, నారాయణ, సవిత, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, పలువురు ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ.. స్ఫూర్తికి మారుపేరు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. "అమెరికాలో స్టాట్యూ ఆఫ్ లిబర్టీ, గుజరాత్‌లో స్టాట్యూ ఆఫ్ యూనిటీ ఉన్నాయి. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో మనందరి కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడి గుర్తుగా 'స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్' ఉంది. ఆయన ఒక కులానికి చెందిన వ్యక్తి కాదు, తెలుగు ప్రజలందరి వాడు. ఆయన త్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. తపాలా శాఖ రూపొందించిన అమరజీవి పొట్టి శ్రీరాములు పోస్టల్ కవర్‌ను ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

**గత పాలనపై, రాజధాని విధ్వంసంపై ఆవేదన**

గత ఐదేళ్ల పాలనలో రాజధాని అమరావతిని విధ్వంసం చేసిన తీరుపై చంద్రబాబు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "తెలుగు జాతికి గుర్తింపు లేని రోజుల్లో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసి రాష్ట్రాన్ని సాధిస్తే, గత పాలకులు రాజధానితో మూడు ముక్కలాట ఆడారు. అమరావతిని శ్మశానం అన్నారు, ఎడారి అన్నారు. రాజధాని లేని పరిస్థితి తీసుకొచ్చారు. పొట్టి శ్రీరాములు త్యాగాన్ని మొదట్లో ఎవరూ గుర్తించని విధంగానే, రాజధాని కోసం 34,000 ఎకరాల భూములిచ్చిన ఇక్కడి రైతుల త్యాగాన్ని కూడా గత ప్రభుత్వం అవమానించింది. 2019-24 మధ్య రాజధాని రైతులు చేసిన పోరాటం ఒక చరిత్ర," అని అన్నారు.

**అభివృద్ధి, సంక్షేమం మా లక్ష్యం**

టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం రాష్ట్ర పునర్నిర్మాణం కోసం ఏర్పడిందని, అభివృద్ధి-సంక్షేమాన్ని సమతూకంతో ముందుకు తీసుకెళ్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. "మూడేళ్లలో అమరావతిని ఎలా అభివృద్ధి చేస్తామో మీరే చూస్తారు. 'నా రాజధాని అమరావతి' అని ప్రతి ఒక్కరూ గర్వంగా చెప్పుకునేలా తీర్చిదిద్దుతాం. రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును విధ్వంసం చేశారు. ఇప్పుడు దాని నిర్మాణాన్ని వేగవంతం చేశాం. వచ్చే పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని జాతికి అంకితం చేస్తాం," అని హామీ ఇచ్చారు.

**ఆర్యవైశ్యులకు భరోసా.. కీలక నిర్ణయాలు**

ఈ సందర్భంగా ఆర్యవైశ్యులకు ప్రభుత్వం అండగా ఉంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. "గత ప్రభుత్వంలో ఆర్యవైశ్యులు వ్యాపారాలు చేసుకోలేని భయానక పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ భయం లేదు. దానధర్మాలకు ముందుండే ఆర్యవైశ్యులు అదే సంకల్పంతో ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. వారి మనోభావాలను గౌరవిస్తూ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆత్మార్పణ దినాన్ని అధికారికంగా నిర్వహిస్తాం. వాసవీ మాత పుట్టిన పెనుగొండను 'వాసవీ పెనుగొండ'గా మారుస్తున్నాం. వేర్వేరు పేర్లతో ఉన్న ఉపకులాలన్నింటినీ 'ఆర్యవైశ్యులు'గా పరిగణిస్తూ త్వరలోనే జీవో తెస్తాం," అని ప్రకటించారు.

**పవన్ చొరవతో 'అమరజీవి జలధార'**

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ముందుకు తీసుకెళుతున్న, ఇంటింటికి నీళ్లిచ్చే కేంద్ర ప్రభుత్వ పథకం 'జల్ జీవన్ మిషన్'కు రాష్ట్రంలో 'అమరజీవి జలధార' అని పేరు పెడుతున్నట్లు చంద్రబాబు తెలిపారు. నీరు తాగే ప్రతీసారి ప్రజలు పొట్టి శ్రీరాములును స్మరించుకోవాలనేదే దీని ఉద్దేశమని వివరించారు. ప్రధాని మోదీ 'వికసిత్ భారత్' లక్ష్యంతో పనిచేస్తున్నారని, దేశంలో ఆంధ్రప్రదేశ్‌ను నంబర్-1 రాష్ట్రంగా నిలపడమే అమరజీవికి మనం ఇచ్చే నిజమైన నివాళి అని చంద్రబాబు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ముందుకు సాగుతోందని, కష్టకాలంలో సమిష్టిగా పనిచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిద్దామని పిలుపునిచ్చారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ సొసైటీని ఏర్పాటు చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

# మీతో కలిసి రాలేం

-మొదటిపేజీ తరువాయి

ద్వారా హర్మూజ్ జల సంధిని తెరిపించడానికి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అక్కడికి యుద్ధ నౌకలను పంపేందుకు మిత్ర దేశాలతోపాటు చైనా ససేమిరా అన్నాయి. ఆ యుద్ధంతో నాటోకు సంబంధం లేదని ఐరోపా దేశాలు తెగేసిచెప్పాయి. మరోవైపు ఇరాన్, లెబనాన్‌లపై ఇజ్రాయెల్, అమెరికా దాడులను కొనసాగించాయి. ఇరాన్ డ్రోన్ దాడితో దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని తెరిచిన కొద్ది గంటల్లోనే మూసివేయాల్సి వచ్చింది. గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై, ఇంధన మౌలిక వసతులపై ఇరాన్ దాడులను కొనసాగించింది. పశ్చిమాసియాలో సైనిక చర్యను వెంటనే నిలిపేయాలని అమెరికా, ఇజ్రాయెల్‌ను చైనా కోరింది. హర్మూజ్‌ను తెరిపించడానికి చైనా సహా పలు దేశాలు యుద్ధ నౌకలను పంపాలని ట్రంప్ కోరిన నేపథ్యంలో ఆ దేశం స్పందించింది. అన్నివైపుల నుంచీ దాడులను వెంటనే ఆపాలని చైనా సూచించింది.

హర్మూజ్‌ను తెరిపించడానికి ఆచరణీయ ప్రణాళికను తాము కోరుకుంటున్నామని బ్రిటన్ ప్రధాని కీర్‌స్టార్మర్ తెలిపారు. యుద్ధాన్ని మరింత విస్తరించబోమని స్పష్టంచేశారు. దీనిపై అమెరికా, గల్ఫ్, ఐరోపా దేశాలతో చర్చిస్తున్నామన్నారు. దీనిని బట్టి హర్మూజ్‌కు యుద్ధ నౌకలను పంపే ఉద్దేశం ఆయనకు లేనట్లు కనిపిస్తోంది.

జపాన్ ప్రధాని సనాయీ తకాయిచి పార్లమెంటు వేదికగా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. పశ్చిమాసియా సముద్ర జలాల మీదుగా రాకపోకలు సాగించే ఆయిల్ ట్యాంకర్లు, నౌకలకు భద్రత కల్పించేందుకు నౌకాదళాన్ని పంపే ఆలోచనేదీ లేదని ఆమె వెల్లడించారు.

తమ నౌకాదళాన్ని హర్మూజ్ వద్దకు పంపే అంశంపై ప్రస్తుతం అమెరికాతో చర్చలు జరుపుతున్నట్లు దక్షిణ కొరియా తెలిపింది. హర్మూజ్ జల సంధిపై తాము అమెరికాతో ఎటువంటి ద్వైపాక్షిక చర్చలు జరపలేదని భారత్ స్పష్టం చేసింది.

ఇది నాటో యుద్ధం కాదని జర్మనీ ఛాన్సలర్ అధికార ప్రతినిధి స్టెఫాన్ కొర్నెలియస్ తెలిపారు. యుద్ధం ప్రారంభానికి ముందు అమెరికా తమను సంప్రదించలేదని స్పష్టం చేశారు. చర్చల ద్వారా యుద్ధానికి ముగింపు పలికే ప్రసక్తే లేదని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ స్పష్టంచేశారు. తమ దేశం కాల్పుల విరమణనుగానీ, చర్చలనుగానీ కోరుకోవడం లేదని సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. దుబాయ్ విమానాశ్రయంలో నిలిచి ఉన్న విమానాలు. చమురు ట్యాంకుపై డ్రోన్ దాడి అనంతరం ఆ ప్రాంతంలో అలముకున్న పొగ

**రవాణాపై దెబ్బ**

హర్మూజ్ ప్రాంతంలో నౌకలపై ఇరాన్ దాడులు, హెచ్చరికలతో నౌకల రవాణా దాదాపుగా నిలిచిపోయింది. దీంతో ఏదో ఒకటి చేయాలనే ఒత్తిడి అమెరికా నాయకత్వంపై పెరుగుతోంది. అదే సమయంలో వినియోగదారులపై ధరల భారం పడుతోంది.

హర్మూజ్‌లో నౌకల రవాణాను పునరుద్ధరించేందుకు ఆ ప్రాంతంలో ఉమ్మడిగా పోలీసింగ్ చేయాలని ట్రంప్ పిలుపునివ్వగా ఎవరూ స్పందించలేదు. యుద్ధ నౌకలను పంపాలని చైనా, ఫ్రాన్స్, జపాన్, దక్షిణ కొరియా, బ్రిటన్‌లను కోరారు. దీంతో.. వారు నౌకలను పంపినా, పంపకపోయినా అన్ని విషయాలను గుర్తుంచుకుంటామని బెదిరింపు ధోరణిలో మాట్లాడారు. తన చైనా పర్యటననూ వాయిదా వేసుకుంటానని హెచ్చరించారు.

**లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ బలగాలు**

పరిమిత ఆపరేషన్ల కోసం లెబనాన్‌లోకి ఇజ్రాయెల్ బలగాలు ప్రవేశించాయి. హెజ్‌బొల్లా మిలిటెంట్ గ్రూపు దాడుల నుంచి సరిహద్దు ప్రజలను రక్షించడానికి ఈ ఆపరేషన్ చేపట్టామని సైన్యం అధికార ప్రతినిధి లెఫ్టినెంట్ కర్నల్ నదవ్ షోషానీ తెలిపారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ముగ్గురు మరణించారు. ఇందులో ఇద్దరు వైద్య సిబ్బంది ఉన్నారు. సోమవారం తెల్లవారుజామున లెబనాన్ రాజధాని బీరుట్‌లో భారీ పేలుడు శబ్దాలు వినిపించాయి. యుద్ధం తొలి రెండు వారాల్లో 70శాతం ఇరాన్ క్షిపణి ప్రయోగ కేంద్రాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. మొత్తం 7,600 దాడులు చేశామని, 85శాతం గగనతల రక్షణ వ్యవస్థలు ధ్వంసమయ్యాయని, అణు కేంద్రాలనూ ధ్వంసం చేశామని వివరించింది. ఇరాక్‌లోని జుర్ఫ్ అల్-శఖర్ ప్రాంతంలో ఉన్న ఇరాన్ అనుకూల పాపులర్ మొబిలైజేషన్ ఫోర్సెస్‌పై (పీఎంఎఫ్) దాడులు జరిగాయి.

**దుబాయ్ విమానాశ్రయంపై..**

దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని ఇంధన ట్యాంకుపై డ్రోన్‌తో ఇరాన్ దాడి చేసింది. అగ్నిమాపక శకటాలు మంటలను ఆర్పేశాయి.

యూఏఈ రాజధాని అబుధాబీలో ఓ వాహనంపై ఇరాన్ క్షిపణి పడింది. ఈ ఘటనలో పాలస్తీనావాసి మరణించారు. చమురు క్షేత్రాలున్న తూర్పు ప్రాంతంపై ఇరాన్ ప్రయోగించిన 37 ఇరాన్ డ్రోన్లను సౌదీ అరేబియా అడ్డుకుంది. బహ్రెయిన్ దేశంపైకి దూసుకొచ్చిన 4 క్షిపణులు, 3 డ్రోన్లను రక్షణ వ్యవస్థ అడ్డుకుంది.

ఇజ్రాయెల్ మధ్య ప్రాంతంలో సైరన్ల మోత మోగింది. ఇరాన్ నుంచి క్షిపణులు దూసుకొచ్చాయి. వాటిని గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయి. జెరూసలెంలో చర్చికి సమీపంలోని గ్రీక్ ఆర్థోడాక్స్ పేట్రియార్క్ పైకప్పుపై యుద్ధ శకలం పడింది. అది ఏసుక్రీస్తుకు సిలువ వేసిన, ఆయనను సమాధి చేసిన ప్రాంతంలో నిర్మించిన చర్చికి సమీపంలోనే ఉంది. కువైట్, ఖతార్‌లపైనా దాడులు జరిగాయి.

# రాజ్యసభకు నితిన్, నీతీశ్ ఎన్నిక

-మొదటిపేజీ తరువాయి

నీతీశ్‌తోపాటు కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకుర్ (జేడీయూ), శివేశ్ కుమార్ (భాజపా), ఉపేంద్ర కుశ్వాహా (రాష్ట్రీయ లోక్ మోర్చా) ఉన్నారు. సోమవారం ఈ ఐదుగురి ఎన్నికను విధానసభ కార్యదర్శి, రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఖ్యాతి సింగ్ ప్రకటించారు. వాస్తవానికి బిహార్‌లో నలుగురు సభ్యులు ఎన్నిక కావడానికి సంపూర్ణ మెజారిటీ ఉంది. ఐదో అభ్యర్థికి కొన్ని ఓట్లు తక్కువ ఉన్నాయి. దీంతో ప్రతిపక్షం ఆర్జేడీ.. అమరేంద్ర ధారి సింగ్‌ను బరిలోకి దింపింది. అయితే ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థులంతా విజయం సాధించారు. కాంగ్రెస్‌కు చెందిన ముగ్గురు అభ్యర్థులు ఓటేయలేదు. ఆర్జేడీ ఎమ్మెల్యే ఒకరు గైర్హాజరయ్యారు.

**హరియాణాలో వివాదం**

హరియాణాలోని రెండు రాజ్యసభ స్థానాలకు సోమవారం పోలింగ్ జరిగింది. భాజపా అభ్యర్థి సంజయ్ భాటియా, కాంగ్రెస్ అభ్యర్థి కరంవీర్ బోధ్, స్వతంత్ర అభ్యర్థి సతీశ్ నందల్ రంగంలో ఉన్నారు. 4 గంటలకు పోలింగ్ పూర్తయింది. 5 గంటలకు కౌంటింగ్ ప్రారంభమైంది. కానీ రహస్య ఓటింగ్ నిబంధనల ఉల్లంఘన జరిగిందంటూ భాజపా, కాంగ్రెస్ ఫిర్యాదు చేయడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయింది. ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బ్యాలెట్ పేపరును మడవకుండా బాక్సులో వేశారని పోలింగ్ ముగియడానికి ముందే భాజపా ఫిర్యాదు చేసింది. ఆ తర్వాత కాంగ్రెస్ కూడా భాజపా సభ్యుడు అనిల్ విజ్‌పై ఫిర్యాదు చేసింది. ఆయన రహస్య ఓటింగ్ నిబంధనలను ఉల్లంఘించారని ఆరోపించింది. రాజ్యసభ ఎన్నికల సమగ్రతను దెబ్బతీసే ప్రయత్నం జరిగిందంటూ ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు.

# వాణిజ్య సంబంధాలు దెబ్బతింటాయ్

-మొదటిపేజీ తరువాయి

తర్వాత విదేశాల్లో తయారీపై వాణిజ్య దర్యాప్తునకు అధ్యక్షుడు ఆదేశించడం తీవ్ర ఆందోళనకరమని అభిప్రాయపడింది. సోమవారం ఫ్రాన్స్ రాజధాని పారిస్‌లో అమెరికా, చైనాల మధ్య వాణిజ్య చర్చలు ముగిసిన అనంతరం చైనా అంతర్జాతీయ వాణిజ్య ప్రతినిధి లీ చెంగాంగ్ మీడియాతో మాట్లాడారు. 'దర్యాప్తులో తేలే అంశాలు.. అమెరికా, చైనాల స్థిరమైన వాణిజ్య, ఆర్థిక సంబంధాలను దెబ్బతీస్తాయి' అని లీ స్పష్టం చేశారు. ట్రంప్ చైనా పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ చర్చలు జరిగాయి. అయితే హర్మూజ్‌కు యుద్ధ విమానాలను పంపకపోతే తన పర్యటనను వాయిదా వేసుకుంటానని ట్రంప్ హెచ్చరించారు. దీనిపై లీ స్పందించలేదు. అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ మాత్రం.. దీనికి, ట్రంప్ పర్యటన వాయిదా పడటానికి సంబంధం లేదని తెలిపారు. పారిస్‌లో చర్చలకు ఆయన నాయకత్వం వహించారు.

# పొట్టి శ్రీరాములు గురించి గాంధీ వ్యాఖ్యలను గుర్తు చేసిన పవన్ కల్యాణ్

-మొదటిపేజీ తరువాయి

స్వాతంత్ర్యం తీసుకురాగలను" అని గాంధీజీ అన్నారంటే, ఆయన సంకల్ప బలం ఎంతటిదో అర్థం చేసుకోవచ్చని కొనియాడారు. రాజధాని ప్రాంతంలో ఇంతటి మహోన్నతమైన విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ద్వారా భావితరాలకు మన చరిత్రను అందించినట్లవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాల వల్లే మనకు స్వేచ్ఛ లభించిందని ఆయన తెలిపారు. తాను పొట్టి శ్రీరాములు గారిని ప్రత్యక్షంగా కలిసే అవకాశం పొందలేదని, అయితే వారి కుటుంబ సభ్యులను చూడటం ద్వారా వారి త్యాగాలను గుర్తు చేసుకునే అవకాశం లభించిందని పవన్ అన్నారు. అమరావతి నడిబొడ్డున పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేసినందుకు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఈ కార్యక్రమం నిర్వహణలో కీలకంగా వ్యవహరించిన మంత్రి నారా లోకేశ్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# పొట్టి శ్రీరాములు ట్రస్ట్ సభ్యులకు నారా లోకేశ్ ఆత్మీయ విందు...

-మొదటిపేజీ తరువాయి

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని విజయవంతం చేసిన వారి కృషిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఛైర్మన్ దూండి రాకేష్‌ను శాలువా, ప్రత్యేక జ్ఞాపికతో లోకేశ్ ఘనంగా సత్కరించారు. తన యువగళం పాదయాత్ర సమయంలో పొట్టి శ్రీరాములు స్వగ్రామానికి వెళ్లి స్ఫూర్తి పొందానని లోకేశ్ గుర్తుచేసుకున్నారు. అమరజీవి త్యాగనిరతిని, పోరాట స్ఫూర్తిని భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని నొక్కిచెప్పారు. ప్రజల్లో ఆయన చరిత్రపై చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ క్రమంలో, రాబోయే 12 నెలల్లోనే స్మృతివనం, ఫొటో గ్యాలరీ, మ్యూజియం, మినీ థియేటర్, ఆడిటోరియం, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, 2047 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యమని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్, పొట్టి శ్రీరాములు మనవరాలు రేవతి తంగుడు, అనురాధ దేవకి, ఇతర కుటుంబ సభ్యులు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. మంత్రి లోకేశ్ అందరినీ పేరుపేరునా పలకరించి, వారితో కలిసి ఫొటోలు దిగారు. ఈ సమావేశం ఆద్యంతం ఆహ్లాదకర వాతావరణంలో సాగింది.

# మోదీ చేతిలో కీలుబొమ్మల్లా రాష్ట్ర నాయకులు

-మొదటిపేజీ తరువాయి

నిర్వహించిన బహిరంగ సభలో, ఆమదాలవలస మండలంలోని కొర్లకోటలో నిర్వహించిన రచ్చబండలో ఆమె మాట్లాడారు. ఉపాధిహామీ పథకాన్ని ఆపేసి, మరెన్నో మార్పులు చేశామంటూ వీబీజీ-రామ్‌జీని తీసుకొస్తున్నారని, దీని వల్ల పేదలకు లాభం కంటే నష్టమే ఎక్కువని చెప్పారు. ఉపాధిహామీ పథకం పేరు మార్పుపై కూటమిలో ఉన్న నేతలే కాదు మాజీ సీఎం జగన్ కూడా మాట్లాడకపోవడం సిగ్గుచేటు అన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం కేంద్రాన్ని డిమాండ్ చేస్తానని ముఖ్యమంత్రయిన జగన్ ప్రజలను మోసగించారని విమర్శించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సైతం హోదా అడిగే ధైర్యం చేయట్లేదన్నారు.

# భారత్‌కు చేరుకున్న 'శివాలిక్'

-మొదటిపేజీ తరువాయి

కుంది. ఎల్పీజీని మోసుకొచ్చిన శివాలిక్ ట్యాంకర్ సోమవారం భారత్‌లోని గుజరాత్ ముంద్రా పోర్ట్‌కు వచ్చింది. ఈ శివాలిక్ నౌకలో 45,000 మెట్రిక్ టన్నుల గ్యాస్ భారత్‌కు వచ్చిందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 80 వేల మెట్రిక్ టన్నుల క్రూడ్ ఆయిల్‌తో వస్తోన్న 'జగ్ లడ్కీ' నౌక మంగళవారం భారత్‌కు చేరుకుంటుందని నౌకాయాన మంత్రిత్వశాఖ ప్రత్యేక కార్యదర్శి రాజేశ్ కుమార్ సిన్హా వెల్లడించారు. అలాగే పర్షియన్ గల్ఫ్‌కు పశ్చిమాన 22 భారత నౌకలు ఉన్నాయని, వాటిల్లో 616 మంది నావికులు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. హర్మూజ్ జలసంధికి ఇరువైపులా వందలాది నౌకలు చిక్కుకుపోగా.. ఈ మార్గంలో భారత నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో రెండు భారత జెండాలు ఉన్న ఎల్పీజీ నౌకలు రెండురోజుల క్రితం సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటాయి. అందులో ఒకటి శివాలిక్ కాగా.. మరొకటి నందాదేవి. శివాలిక్ తాజాగా భారత్ చేరుకోగా.. మంగళవారం ఉదయం 'నందాదేవి' కూడా 45 వేల మెట్రిక్ టన్నుల గ్యాస్‌ను తీసుకొని కాండ్లా పోర్టుకు రానుంది.

# పశ్చిమాసియాలో ఘర్షణలు.. 5,500కు పైగా విమానాల రద్దు

-మొదటిపేజీ తరువాయి

పౌర విమానయానశాఖ మంత్రి కె.రామ్మోహన్ నాయుడు సోమవారం రాజ్యసభలో వెల్లడించారు. ఇందులో భారత విమానయాన సంస్థలకు చెందిన 4,335, విదేశీ సంస్థలకు చెందిన 1,187 విమానాలు ఉన్నాయని తెలిపారు. "ప్రస్తుత సంక్షోభ సమయంలో విమానయాన కార్యకలాపాల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నాం. పౌర విమానయానశాఖ, డీజీసీఏలు పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. అవకాశం లభించినప్పుడల్లా విమానాలు నడుపుతున్నాం. ఇలా ఇప్పటివరకు దాదాపు 2.19 లక్షల మందిని భారత్‌కు చేరవేశాం. ఇప్పటికీ కొన్ని గగనతలాలు మూసే ఉన్నాయి. అవి అందుబాటులోకి వచ్చి, సురక్షిత పరిస్థితులు ఏర్పడినప్పుడే విమానాల రాకపోకలు సాధారణ స్థితికి చేరుకోగలవు" అని ఓ ప్రశ్నకు కేంద్రమంత్రి సమాధానం ఇచ్చారు. గతేడాది డిసెంబరులో ఇండిగో విమానాలు పెద్దసంఖ్యలో రద్దయిన వ్యవహారంపై స్పందిస్తూ.. ప్రయాణికులకు ట్రావెల్ కూపన్ల రూపంలో రూ.163.92 కోట్ల మేర పరిహారం ఇప్పటికే అందినట్లు తెలిపారు.

# విజయవాడలో ఇఫ్తార్ విందుకు హాజరైన సీఎం చంద్రబాబు...

-మొదటిపేజీ తరువాయి

ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని వక్ఫ్ ఆస్తులను పరిరక్షించడానికి అన్ని చర్యలూ తీసుకుంటామని హామీ ఇచ్చారు. గత 21 నెలల్లో ప్రభుత్వం అమలు చేసిన పలు సంక్షేమ పథకాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. ముస్లిం మైనార్టీల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ విందులో మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోండా ఉమ, షేక్ నజీర్ అహ్మద్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, ముస్లిం మత పెద్దలు, మైనార్టీ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం.






- రైతు బాగున్నపుడే రాష్ట్రం లోని ప్రతి ఒక్కరూ బాగుంటారు.
- సంప్రదాయ పంటలతో పాటు లాభాదాయ పంటల పై రైతులు దృష్టి సారించాలి.
- రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి కొల్లు రవీంద్ర.

**వెంకుపాలెం, పెన్ సత్తా, మార్చి 16:** రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనకాపల్లి మండలం, వెంకుపాలెం గ్రామం రైతు సేవా కేంద్రం వద్ద సోమవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రైతన్న మీకోసం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులకు చేసిన మేలును వివరించడం లక్ష్యంగా గన్నవరంలో రైతన్న మీకోసం కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్రంలో సుమారు 46.83 లక్షల మందికి అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేశాం. తొలి విడతలో రూ.7,000 చొప్పున రూ.3,174 కోట్లు, రెండో విడతలో రూ.3,135 కోట్లు మూడో విడతలో రూ.6,000 చొప్పున రూ.2,600 కోట్లు చొప్పున సుమారు రూ.9,000 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. అనకాపల్లి జిల్లాలో రూ.132 కోట్లు జమ చేయడం జరిగిందన్నారు. ఎపుడూ లేని విధంగా రైతు సంక్షేమం కోసం రూ.53 వేల కోట్లతో బడ్జెట్ ప్రవేశపెట్టాం అన్నారు. ప్రస్తుతం పంటల దిగుబడి కోసం రసాయనాల వినియోగం తీవ్రంగా చేస్తున్నారు. ఇది అత్యంత ప్రమాదకరం. రసాయన వినియోగం పెంచితే భవిష్యత్ అగమ్యగోచరం అవుతుంది. పంజాబ్ లో ఏం జరిగిందో ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. క్యాన్సర్ వ్యాధితో రైతులు ప్రాణాలతో పోరాటం చేస్తున్నారు. ప్రతి రోజు క్యాన్సర్ బాధితులతో ఒక రైలు దిల్లీ వెళ్లాల్సిన దుస్థితి దాపురించింది. అందుకే ప్రకృతి వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. తద్వారా దిగుబడులు పెంచుకునే వెసులుబాటు కల్పిస్తున్నాం. మొన్నటి వరకు వ్యవసాయం అంటే గోదావరి జిల్లాలు మాత్రమే గుర్తొచ్చేవి. కానీ నేడు అనంతపురం హార్టికల్చర్ ద్వారా గోదావరి జిల్లాలకు పోటీగా నిలుస్తోంది. స్ప్రింక్లర్స్, డ్రిప్ ఇరిగేషన్ కు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి. 2027 నాటికి పోలవరం పూర్తి చేసే లక్ష్యంతో పని చేస్తున్నాం. లెఫ్ట్ కెనాల్ ద్వారా అనకాపల్లి జిల్లాకు పుష్కలంగా సాగు నీరు అందించే అవకాశం ఉంది. బిల్ గేట్స్ ఏపీ పర్యటనలో వ్యవసాయ అవసరాలకు సాంకేతిక సహకారం అందించేందుకు ముందుకొచ్చారు. పంటలను అమ్ముకోవడం కాకుండా ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ముందుకు రావాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ వ్యవసాయం, అనుబంధ రంగాల శాఖల సిబ్బంది రైతుల ఇళ్లకు వెళ్లి ఆధునిక వ్యవసాయ పద్ధతులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధనతో రైతులకు అవగాహన కలిగించడం రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. జిల్లాలో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. మరింత విస్తీర్ణంలో ప్రకృతి సాగుచేసేలా రైతులలో అవగాహన పెంచాలని వ్యవసాయాధికారులు కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో పొలం పిలుస్తోంది, పొలంబడి కార్యక్రమాలు నిర్వహించి సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతుల పై రైతులకు అవగాహన కలిగిస్తున్నామన్నారు. రైతులకు ఎరువులు, విత్తనాలు సబ్సిడీ పై అందించడమే కాక అన్నదాత సుఖీభవ పథకం కింద రెండు విడతలలో 2,42,536 మంది రైతులకు 134.27 కోట్ల రూపాయలు ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం అందించిందన్నారు. సాగులో యాంత్రీకరణను ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నదని, జిల్లాలో 60 డ్రోన్లను రైతులకు అందించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సూచించిన నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, వ్యవసాయంలో సాంకేతికత, ఆహార శుద్ధి, ప్రభుత్వ మద్దతు. పాడి రైతులకు అండ వంటి పంచ సూత్రాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు, వాటిని ప్రతీ రైతు వినియోగించుకునే విధానాలపై రైతుల ఇంటివద్దకు వెళ్లి ప్రతీ రైతుకు వ్యవసాయ, అనుబంధాల రంగాల సిబ్బంది 15 రోజులపాటు తెలియజేశారన్నారు. ఈ కార్యక్రమంలో పంచ సూత్రా లైన నీటి భద్రత, డిమాండ్ ఆదారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెస్సింగ్, ప్రభుత్వం నుంచి పూర్తి మద్దతు గురించి అవగాహన కల్పించడం జరుగుతుందని, కావున రైతు సోదరులు ఈ కార్యక్రమమను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ రైతన్న మీకోసమని కార్యక్రమం వెంకుపాలెం గ్రామంలో పెట్టడం చాలా సంతోషకరమని తెలిపారు. అదే విధంగా రైతులందరూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని వ్యవసాయ, సాంకేతికతను ఉపయోగించాలని ఈ సందర్భంగా రైతులకు తెలిపారు. ఈ రైతన్న మీకోసం కార్యక్రమంలో రైతులు యొక్క ఆదాయం పెరగడమే ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రైతన్న బాగుంటే దేశం బాగుంటుందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం పెట్టుకొని ఉన్నారని తెలిపారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆశా దేవి మాట్లాడుతూ ఈ రైతన్న మీకోసం కార్యక్రమం మన అనకాపల్లి జిల్లాలలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ రైతన్న మీకోసం కార్యక్రమం ముఖ్య ఉద్దేశం రైతులందరూ వ్యవసాయ సాంకేతికతను అవలంబించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందడమే ప్రభుత్వ లక్ష్యంగా మీకోసం కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రైతన్న మీకోసం కార్యక్రమం ద్వారా వ్యవసాయ శాఖ ద్వారా అమలు అవుతున్న పథకాలు రాయితీలు గురించి రైతులకు వివరించడం జరుగుతుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఆశా దేవి, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మన్లు బత్తుల తాతీయ్య బాబు, మళ్ల సురేంద్ర బాబు డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, మాజీ ఎమ్మెల్సి బుద్ధ జగదీష్, సహాయ వ్యవసాయ సంచాలకులు సిహెచ్.సుబ్రమణ్యం, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారులు, మండల వ్యవసాయ అధికారి రంగాచారి, తాసిల్దార్ ఆనందరావు, ఆత్మ ఏటీఎం పి.రామకృష్ణ, మండల టిడిపి అధ్యక్షులు బాబి, ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.





# చంద్రబాబు పాయకరావుపేట పర్యటన నేపథ్యంలో సమీక్ష సమావేశం.





- భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలి.
- కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

**నక్కపల్లి, పెన్ సత్తా, మర్చి 16**: ఈ నెల 23 న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాయకరావుపేట నియోజకవర్గం పర్యటన నేపథ్యంలో ఏర్పాట్ల పై సోమవారం నక్కపల్లిలో హోం మంత్రి వంగలపూడి అనిత నివాసంలో కూటమి నేతల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్చార్జి మంత్రి కొల్లి రవీంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆధ్వర్యంలో భద్రతా బందోబస్తు, కార్యక్రమ నిర్వహణ పై విస్తృతంగా చర్చించారు.

పర్యటనకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో జనసమీకరణ, ఆహారం, రవాణా తదితర అంశాల పై కూడా సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి తొలిసారి పాయకరావుపేటకు వస్తున్న నేపథ్యంలో భారీ స్థాయిలో స్వాగత ఏర్పాట్లు చేయాలని హోం మంత్రి అనిత అధికారులకు సూచించారు. రూ.1.35 లక్షల కోట్ల పెట్టుబడులతో జిల్లాలో వేలాది మంది స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే ప్రణాళికలను ప్రభుత్వం అమలు చేస్తోందని, ఈ లక్ష్యాలను ప్రజలందరికీ తెలియజేసేలా కార్యక్రమ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కూటమి నాయకులంతా బాధ్యత తీసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వ ఆశయాలు, ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలు విస్తృతంగా ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో జోన్-1 కో ఆర్డినేటర్, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య, జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కార్పొరేషన్ చైర్మన్లు మల్ల సురేంద్ర, పి.జి.వి.ఆర్ కుమార్, డీసీఎంఎస్ చైర్మన్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## పొట్టి శ్రీరాములు త్యాగం చిరస్మరణీయం

- ఇంచార్జి మంత్రి కొల్లు రవీంద్ర.
- కలెక్టరేట్ లో ఘనంగా పొట్టి శ్రీరాములు 125 వ జయంతి వేడుకలు.





**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 16**: తెలుగు వారి అస్తిత్వాన్ని కాపాడేందుకు అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని జిల్లా ఇంచార్జి మంత్రి, రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. పొట్టి శ్రీరాములు 125 వ జయంతిని పురస్కరించుకొని సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా స్థాయి జయంతి వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ తో కలిసి ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఘనంగా నివాళులు అర్పించిన జిల్లా ఇంచార్జి మంత్రి. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు త్యాగాన్ని సదా స్మరించు కోవడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోంది. ఇప్పుడు అమరావతిలో త్యాగాల విగ్రహం పేరుతో 6.8 ఎకరాల్లో 58 అడుగుల అమరజీవి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నాం. సాధారణ ఉద్యోగిగా జీవితం ప్రారంభించి, గాంధీ స్ఫూర్తితో స్వతంత్ర పోరాటంలో భాగస్వామి అయ్యారు. బడుగు బలహీన వర్గాల ప్రజలకోసం పోరాటం చేశారు. భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటు కోసం ఏకంగా నిరాహార దీక్ష చేశారు. ఒంటరిగా పోరాటం వారి ఆత్మ త్యాగంతో జ్వాలగ్నిగా మారింది. రాష్ట్రం కోసం ప్రాణాలు సైతం త్యాగం చేసిన త్యాగమూర్తి గురించి ప్రతి ఒక్కరికీ తెలియజేయాలి. అలాంటి వ్యక్తి జీవితాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలి. ప్రజా రాజధాని అమరావతిలో తొలి విగ్రహం పొట్టి శ్రీరాములు ది ఏర్పాటు చేసుకోవడం గర్వంగా ఉంది. వారి ప్రాణ త్యాగాన్ని సదా స్మరించుకుంటూ రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం పాటుపడతామని మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ మాట్లాడుతూ మాట్లాడుతూ తెలుగు వారి ఆత్మ గౌరవం కోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని గాంధేయ మార్గంలో పోరాటం చేసి ప్రాణాలర్పించిన అమర జీవి త్యాగాన్ని ఈ తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. భాషా ఆధారంగా రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణకు కూడా ఆయన త్యాగం ప్రధాన కారణంగా నిలిచిందన్నారు. ఆయన త్యాగం వల్లే ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం సాధ్య మైందని యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ సేవలో ముందుకు రావాలని ఈ సందర్భంగా కలెక్టర్ విజయ క్రిష్ణన్ పిలుపునిచ్చారు.

జాయింట్ కలెక్టర్ శౌర్యా మాన్ పటేల్ మాట్లాడుతూ తెలుగు ప్రజల స్వాభిమానానికి ప్రతీకగా నిలిచిన పొట్టి శ్రీరాములు త్యాగం భారత చరిత్రలో చిరస్మరణీయమని అన్నారు. తెలుగు జాతి చరిత్రలో ఆయన స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని జాయింట్ కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్డీఓ షేక్ అయిషా, వివిధ రాష్ట్ర కార్పొరేషన్ల చైర్మెన్లు దామాచర్ల సత్య, పీలా గోవిందా సత్యన్నారాయణ, మళ్ల సురేంద్ర బాబు, బత్తుల తాతీయ్య బాబు, డి సి ఎం ఎస్ చైర్మన్ కోట్ని బాలాజీ, కలెక్టరేట్ సిబ్బంది, మహిళలు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## ధర్మవరం అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలి మంత్రి సత్యకుమార్

- మున్సిపల్ చివరి కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్.
- ఎన్నికల్లో మాత్రమే రాజకీయాలు అభివృద్ధి కోసం అందరం ఒక్కటే.
- మున్సిపల్ కౌన్సిలర్ల సేవలు అభినందనీయం మంత్రి సత్యకుమార్.
- పట్టణాభివృద్ధి పై కేంద్రం ప్రత్యేక దృష్టి మంత్రి సత్యకుమార్ యాదవ్.
- మున్సిపాలిటీల అభివృద్ధికి కేంద్రం ప్రాధాన్యత మంత్రి సత్యకుమార్.
- పట్టణాల్లో పార్కులు, ఫ్లైఓవర్ల నిర్మాణం వేగవంతం మంత్రి.
- నేటితో కౌన్సిలర్ల పదవీకాలం ముగింపు, ధర్మవరంలో చివరి కౌన్సిల్ సమావేశం.





**ధర్మవరం, పెన్ సత్తా, మార్చి 16:** మున్సిపల్ కార్యాలయంలో చైర్ పర్సన్ కాచర్ల లక్ష్మి ఆధ్వర్యంలో చివరి కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయిన తరువాత పట్టణాభివృద్ధి పై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని తెలిపారు. గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు అందుతున్నాయి. అదే విధంగా మున్సిపాలిటీల అభివృద్ధికి కూడా కేంద్రం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పట్టణాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి వనరుల పెంపు కోసం వివిధ కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. అదే విధంగా పట్టణాల్లో పార్కుల అభివృద్ధి,ట్రాఫిక్ నియంత్రణ కోసం ఫ్లైఓవర్ల నిర్మాణాన్ని వేగవంతం చేస్తున్నామని మంత్రి తెలిపారు.

## మార్చి 17 నుండి, ఏప్రిల్ 17 వరకు నూకంబిక అమ్మవారి వార్షిక జాతర.

- సామాన్య భక్తులతో పాటు వీఐపీ, వీవీఐపీల దర్శనాలకై ఏర్పాట్లు పూర్తి.
- శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ.







**అనకాపల్లి, పెన్ సత్తా, మార్చి 16:** నూకంబిక అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు మార్చి 17 నుండి, ఏప్రిల్ 17 వరకు జరగనున్నందున జాతరకు పటిష్ట మైన ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తెలిపారు. రాష్ట్ర పండగగా గుర్తింపు పొందిన, గవరపాలెంలో వెలిసిన, ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకంబిక అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాల ఏర్పాట్ల పై సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో ఉమ్మడి విశాఖ, విజయనగరం జిల్లాల డిసిపి సుజాత, దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు), ఆలయ కార్య నిర్వహణ అధికారి యాళ్ళ శ్రీధర్ తో కలసి వివిధ జిల్లా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి జాతర, కొత్త అమావాస్య, ఉగాది మహోత్సవాల కై భారీ స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేసామని తెలియజేశారు. సామాన్య భక్తులతో పాటు వీఐపీ, వీవీఐపీల దర్శనాల కై ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందన్నారు. క్యూలైన్ల ఏర్పాటు, చలవ పందిళ్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఏడాది అధిక ఉష్ణోగ్రతలు దృష్టి ఉంచుకొని క్యూలైన్ లో ఉండే భక్తులకు త్రాగు నీరు, మజ్జిగ ప్యాకెట్లు, చిన్నపిల్లలకు పాలు సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలియజేశారు. పోలీసు బందోబస్తు ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలు వాహనాలకు పార్కింగ్ సదుపాయం, భక్తులకు అసౌకర్యం కలగకుండా సరిపడా క్యూలైన్లు, మంచినీటి సదుపాయం, వైద్య శిబిరాలు ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య చర్యలు తదితర అంశాల పై అధికారులతో సమీక్షించామని తెలిపారు.

దేవస్థానం చైర్మన్ పీలా నాగ శ్రీను (గొల్ల బాబు) మాట్లాడుతూ ఈ నెల 17, నుండి వచ్చే నెల 17 వరకు నెల రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు ఘనంగా జరుగుతాయని, జాతర, కొత్త అమావాస్య కు ఆలయానికి వచ్చే భక్తులకు ఇటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేస్తామని తెలియజేశారు. ఈ ఏడాది భారీ విద్యుత్ అలంకరణ, స్టేజ్ ప్రోగ్రామ్, నేల వేషాలు తదితర కార్యక్రమాలు కూడా ఏర్పాటు చేశామని అన్నారు. ఎటువంటి సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేశారని, అదే విధంగా మెడికల్, ఫైర్, జీవీఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు కూడా అవసర మైన ఏర్పాట్లు చేస్తున్నారని అని తెలియజేశారు. నూకాంబిక అమ్మవారి జాతర సందర్భంగా ఏపీఎస్ఆర్టీసి అనకాపల్లి జిల్లాకు రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నట్లుగా తెలియజేశారు. విశాఖపట్నం నుండి 5 బస్సులు, చోడవరం, మాడుగుల నుండి 3 బస్సులు, సబ్బవరం, విజయనగరం నుండి- 3, నర్సీపట్నం నుండి- 2, పాయకరావుపేట నుండి - 2, దేవరపల్లి నుండి- 1, అచ్యుతాపురం నుండి - 2 ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లుగా తెలియజేశారు. ఈ సమావేశంలో ఎండోమెంట్ డిప్యూటీ కమిషనర్ ఎన్ సుజాత, ఆలయ ఈవో శ్రీధర్, పోలీస్, జీవీఎంసీ, ఫైర్ సర్వీస్, విద్యుత్ శాఖ, డిఎం అండ్ హెచ్ ఓ, విభాగాల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవికి నివాళులు అర్పించిన పప్పల







**అచ్చుతాపురం, పెన్ సత్తా, మార్చి 16**: మండల కేంద్రం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు 125 జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ పార్లమెంట్ సభ్యులు పప్పల చలపతిరావు, నియోజకవర్గం పరిశీలకులు బొండ జగన్నాథం, రాష్ట్ర కార్యదర్శి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు. ఈ సందర్భంగా అచ్చుతాపురం మండలంలో అనారోగ్యానికి గురై హాస్పిటల్ లో చికిత్స చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి నుండి చెక్కులను అందించడం జరిగింది. అనంతరం అన్నదాత సుఖీభవ 3 వ విడత గా 6,000 రూపాయలు రైతులకు నేరుగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందించడం జరిగిన సందర్భంగా ఈ అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని స్థానిక రైతులకు వివరించడం జరిగింది. అచ్చుతాపురం మండలం కు సంబంధించి 12,11,530 రూపాయలు విలువగల చిక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు పీలా తులసీరామ్, ప్రధాన కార్యదర్శి కాండ్రేగుల అప్పారావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ మామిడి శివ అప్పారావు, యలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కూనిశెట్టి రమణ, ఎంపీటీసీ నీరుకొండ నర్సింగరావు, పోనమల్ల కొండబాబు, వడిసిల శ్రీనివాసరావు, పతివాడ చిన్నయ్య నాయుడు, లాలం రాజు, సరగడం జగ్గప్పరావు తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళులర్పించిన ఎమ్మెల్యే యార్లగడ్డ





**గన్నవరం, పెన్ సత్తా, మార్చి 16:** భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు కోసం తన ప్రాణాలను పణంగా పెట్టిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహోన్నత మైన వ్యక్తి అని గన్నవరం శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు కొనియాడారు. సోమవారం పొట్టిశ్రీరాములు 125 వ జయంతిని పురస్కరించుకుని గన్నవరం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి యార్లగడ్డ ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమరావతి లోని శాఖమూరులో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆవిష్కరించిన 58 అడుగుల పొట్టి శ్రీరాములు భారీ కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం యార్లగడ్డ మాట్లాడుతూ, రాజధాని అమరావతిలో ఇంతటి భారీ విగ్రహాన్ని ప్రతిష్టించడం ఆ మహానుభావుడికి దక్కిన నిజమైన గౌరవమని అన్నారు. బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలే వంటి జాతీయ నాయకులు మాతృభాషలో విద్యాబోధన ఆవశ్యకతను గుర్తించారని, అదే స్ఫూర్తితో ఆంధ్రరాష్ట్ర సాధన కోసం కృష్ణా జిల్లాకు చెందిన భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, నందమూరులో జన్మించిన కవి సామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ వంటి ఎందరో మేధావులు కృషి చేశారని గుర్తు చేశారు. 1906 లోనే మచిలీపట్నం వేదికగా భాషా ప్రయుక్త రాష్ట్రాల డిమాండ్‌ను పట్టాభి సీతారామయ్య తెరపైకి తెచ్చారని గుర్తు చేశారు. ఎన్ని ఉద్యమాలు చేసినా ప్రాణత్యాగం చేస్తే తప్ప లక్ష్యం సిద్ధించదని భావించిన పొట్టి శ్రీరాములు, 58 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన బలిదానంతో తెలుగు రాష్ట్రం ఏర్పడటానికి కారణమయ్యారని చెప్పారు. ఆయన త్యాగం కేవలం ఆంధ్ర రాష్ట్రానికే పరిమితం కాదని, నేడు దేశవ్యాప్తంగా భాషా ప్రయుక్త రాష్ట్రాలు ఏర్పడటానికి ఆయనే ఆద్యుడని కొనియాడారు. ఈ విగ్రహ ఏర్పాటుకు చొరవ చూపిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ధన్యవాదాలు తెలిపారు. అమెరికా లోని 'స్టాచూ ఆఫ్ లిబర్టీ' తరహాలో దీనికి స్టాచూ ఆఫ్ సాక్రిఫైస్ అని పేరు పెట్టిన మంత్రి లోకేష్ ను అభినందించారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే తెలుగు జాతి మొత్తం ఆయనను గౌరవించుకున్నట్లవుతుందని సూచించారు. అనంతరం ప్రజా దర్బార్ లో ప్రజల నుండి వచ్చిన పిర్యాదుల పరిష్కారాలపై అన్ని శాఖల ల అధికారులతో ఎమ్మెల్యే యార్లగడ్డ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు మొత్తం 7,900 ప్రజా ఫిర్యాదులను పరిష్కరించడంతో గన్నవరం నియోజకవర్గం రాష్ట్రంలో ప్రస్తుతం రెండో స్థానంలో ఉందని వెల్లడించారు. ఇంకా మిగిలి ఉన్న 10 శాతం పెండింగ్ కేసులను కూడా త్వరితగతిన పూర్తి చేసి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో ఎలాంటి అలసత్వం వహించినా సహించబోమని, ప్రజలకు వేగంగా సేవలు అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని ఆయన స్పష్టం చేశారు. గన్నవరం నియోజకవర్గ అభివృద్ధియే తన లక్ష్యమని పునరుద్ధరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి షాహిద్ బాబు, అన్ని శాఖల అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కూటమి తోనే అభివృద్ధి సాధ్యం పంచకర్ల

**పెందుర్తి, పెన్ సత్తా, మార్చి 16:** నియోజకవర్గం జీవీఎంసీ 88 వ వార్డు లో 5 కోట్ల 50 లక్షలు రూపాయల పనులకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నాం, మరోసారి మనస్ఫూర్తిగా ఆశీర్వదించండి

ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు.

గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని తూచా తప్పకుండా నెరవేరుస్తున్నాం, వచ్చే ఎన్నికల్లో మరోసారి మనస్ఫూర్తిగా ఆశీర్వదించి, అభివృద్ధికి దోహదపడాలని పంచకర్ల రమేష్ బాబు ప్రజలకు పిలుపునిచ్చారు. పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 88 వ వార్డులో నరవ గ్రామం బర్రెల గ్రౌండ్ కాంపౌండ్ వాల్ నిర్మాణం, నరవ గ్రామం కళ్యాణ మండపంలో వంటగది మరమ్మత్తులు, దుర్గా నగర్, ముత్యమాంబ కాలనీ, సబి వారి పేట, రెల్లి కాలనీ, కొత్తూరు, వెదుళ్ళ నరవ, సంధ్యా నగర్ కాలనీ, రాశి నగర్, బంగారంపేట, బీసీ కాలనీ, చొప్ప వారి మెట్ట మరియు ఇందిరానగర్ కాలనీలలో 5 కోట్ల.50 లక్షల రూపాయల జీవీఎంసీ నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలను స్థానిక కార్పొరేటర్ మొల్లి ముత్యాల తో కలిసి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు చేశారు. ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన ఎమ్మెల్యే రమేష్ బాబు ప్రజలతో మాట్లాడి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రతి పనిని క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యత ప్రమాణాలు గురించి అధికారులకు హెచ్చరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన తర్వాత నగరంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో గత వైసిపి ఐదేళ్ల పాలనలో కనీసం 10 వంతు కూడా జరగలేదని ఆక్షేపించారు. ప్రతిరోజు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేసిన ఇంకా పనులు మిగిలి ఉంటున్నాయని, అది కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధికి తార్కానమని స్పష్టం చేశారు ఇప్పటివరకు వార్డులలో 200 కోట్లు పైగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని తెలియజేశారు. ఈ యొక్క కార్యక్రమంలో జీవీఎంసీ పెందుర్తి జోన్ జోనల్ కమిషనర్ శంకర్రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిలీప్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, జనసేన పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు ఇందల రమణ, వార్డు అధ్యక్షులు ఒబ్బిన జనార్దన్ శ్రీకాంత్, గంతకోరు శివ, పెందుర్తి ఏఎంసి డైరెక్టర్ గల్లా శ్రీనివాసరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు గవర సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యులు ఇల్లపు శ్రీనివాసరావు, లింగం అప్పలరాజు, సూరిబాబు, చల్లా శ్రీనివాసరావు, సింధు, గణేష్, ముత్త అర్జున్, వెదుళ్ళనరవ నుండి అర్జున, బర్రెడ్డి ప్రసాద్, సర్వసిద్ధి రాజు, రాజన్న పైడ్రాజు, నూకరాజు, డాకారుపు శ్రీనివాస్, తదితర జీవీఎంసీ 88 వ వార్డు ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో యొక్క కార్యక్రమాల్లో పాల్గొన్నారు.








## అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన పంచకర్ల







**పెందుర్తి, పెన్ సత్తా, మార్చి 16:** నియోజకవర్గం జీవీఎంసీ 96 వ వార్డులో 10 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన జనసేన పార్టీ ఉమ్మడి విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ సభ్యులు పంచకర్ల రమేష్ బాబు. చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా పెందుర్తి అభివృద్ధి. పెందుర్తి నియోజకవర్గం పరిధి లోని జీవీఎంసీ 10 వార్డుల్లో నూ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు పంచకర్ల రమేష్ బాబు, నగర మేయర్ మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. పెందుర్తి నియోజకవర్గం జీవీఎంసీ 96 వార్డులో సుమారు 10 కోట్ల జీవీఎంసీ నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు శంకుస్థాపనలు చేశారు. పెందుర్తి పెద్ద చెరువు గట్టు పై వాకింగ్ ట్రాక్, సుందరీ కరణ, పెందుర్తి జంక్షన్ లో అయ్యప్ప స్వామి టెంపుల్ నుండి వరుణ్ మోటార్స్ వరకు 95 అడుగుల రోడ్డు విస్తరణ, అలాగే పులగాని పాలెం కూడలి వరకు వర్షపు నీరు ప్రవహించే కాలువ నిర్మాణం వంటి పనులను సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చరిత్రలో శాశ్వతంగా తమ పేరు నిలిచిపోయేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ఆయా పనులు చేపట్టి ప్రజల నుండి అందుతున్న ప్రశంసలతో తమ జన్మ ధన్యం అయిందని పేర్కొన్నారు. అభివృద్ధిని చూసి వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థులను మనస్ఫూర్తిగా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు.

కార్యక్రమంలో జీవీఎంసీ పెందుర్తి జోనల్ కమిషనర్ శంకర్రావు, జీవీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దిలీప్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్, ఏ ఈ శివ, బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ రాము నాయుడు, గవర కార్పరేషన్ డైరెక్టర్ వేగి పరమేశ్వర రావు, పెందుర్తి ఏఎంసి మాజీ చైర్మన్ వేగి దివాకర్, వార్డు అధ్యక్షులు డిబిఎల్ సంతోష్, రాజేంద్ర ప్రసాద్, సేనాపతి సోమశేఖర్, గొర్లి అప్పారావు, సరగడం బుజ్జి, పీలా జితేంద్ర, కిల్లి రమేష్, ఆళ్ల రమేష్, జీవీఎంసీ 96 వ వార్డు ఉమ్మడి ఎన్ డి ఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మెల్లోడుగడ్డ లోకి కలుషిత జలాలు విడుదల నిలుపుదల చేయాలి.





సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గనిశెట్టి డిమాండ్.

**పరవాడ, పెన్ సత్తా, మార్చి 16:** పరవాడ, భరణికం మధ్యన వున్న మెల్లోడు గడ్డ లోకి పరవాడ ఫార్మాసిటీ పరిశ్రమలు, రాంకీ, ఏపీఐఐసీ నుంచి ఏ విధమైన కలుషిత విష జలాలను ఈ గడ్డ లోకి విడుదల చేయకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన గెడ్డ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఈ కాలంలో గడ్డ పూర్తిగా ఎండిపోయి ఉండేదని ఈరోజు మరోసారి జలాలను ఈ గడ్డ లోకి విడుదల చేయడం పట్ల గనిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీని పై ఫిర్యాదు చేయడంతో రాంకీ యాజమాన్యం ట్యాంకర్ల ద్వారా జలాలను తరలించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికే అనేకసార్లు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశామని ఆయన మార్పు రావడంలేదని, భవిష్యత్తులో ఈ గడ్డ లోకి ఏ విధ మైన జలాలు పరిశ్రమల నుండి రాకుండా రాంకీ యాజమాన్యానికి ఆదేశాలు జారీ చేయాలని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులకు గనిశెట్టి డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని గనిశెట్టి హెచ్చరించారు.

# మెగా జాబ్ మేళాకు విశేష స్పందన

**అచ్యుతాపురం, పెన్ సత్తా, మార్చి 16:**2026 మార్చి 16న క్రైట్స్ విద్యా సంస్థలు, వరుణ్ గ్రూప్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జిల్లా నలుమూలల నుండి 200 మందికి పైగా అభ్యర్థులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు. వీరిలో ఇంటర్వ్యూల అనంతరం సుమారు 50 మంది అభ్యర్థులు వివిధ పోస్టులకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అభ్యర్థులు తమకు మంచి ఉద్యోగావకాశాలు లభించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. ఈ జాబ్ మేళాలో క్రైట్స్ విద్యా సంస్థల కరెస్పాండంట్ రెడ్డి చిరంజీవి, వరుణ్ గ్రూప్ హెచ్ఆర్ మేనేజర్ కే.వి.ఎస్.వి. ప్రసాద్, నరసింహ పాల్గొన్నారు.





# యుద్ధం ఆపండి శాంతిని నెలకొల్పండి




**గాజువాక, పెన్ సత్తా, మార్చి 16:**యుద్ధం ఆపండి శాంతిని నెలకొల్పండి అలాగే స్టీల్ ప్లాంట్ కు ఎల్ పి జి నిరంతరాయంగా సరఫరా చేయాలని స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి జె అయోధ్య రామ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేడు స్టీల్ సిఐటియు ఆధ్వర్యంలో స్టీల్ ప్రధాన పరిపాలన భవనం ఎదుట స్టీల్ ప్లాంట్ కు ఎల్ పి జి నిరంతరాయంగా సరఫరా చేయాలని, యుద్ధం ఆపండి శాంతిని నెలకొల్పండి అనే ప్రధాన డిమాండ్ తో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జె అయోధ్య రామ్ మాట్లాడుతూ నేడు ప్రపంచం యుద్ధ భయంతో ఉందని ఆయన అన్నారు. అమెరికా ఇజ్రాయిల్ ఇరాన్ పై జరుపుతున్న యుద్ధానికి ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలు ప్రధానంగా భారత దేశం లోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన వివరించారు. ప్రధానంగా స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి అవసర మైన ఎల్ పి జి సరఫరా లో అంతరాయం కలగడంతో ఆ ప్రభావం ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతోందని ఆయన అన్నారు. నేడు స్టీల్ ప్లాంట్లో ఐదు రోజులకు సరిపడే ఎల్ పి జి నిల్వలు ఉన్నాయని, ఐఒసిఎల్ కి ఆర్డర్ పెట్టి దానికి పైకం చెల్లించినప్పటికీ ఇవ్వడానికి ప్రభుత్వ ఆదేశాలు చూపుతోందని ఆయన అన్నారు. దీంతో బ్లాక్ మార్కెట్ పెరిగి స్టీల్ వినియోగదారులకు స్టీల్ అందదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బ్లాక్ మార్కెట్ నుంచి ప్రజలను కాపాడి స్టీల్ ప్లాంట్ ఉత్పత్తికి అవసర మైన ఎల్ పి జి నిరంతరాయంగా సరఫరాను పునరుద్ధరించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్టీల్ సిఐటియు అధ్యక్షులు యు రామస్వామి మాట్లాడుతూ ఈ యుద్ధం ద్వారా ఎల్ పి జి లభ్యత లేక దేశంలోని సామాన్య ప్రజానీకం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు. ఇదే సమయంలో ప్రభుత్వం ప్రజలను మోసగించే ప్రకటనల ద్వారా మభ్యపెడుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. యుద్ధోన్మాదంతో అమెరికా చేస్తున్న ఈ యుద్ధాన్ని ఆపడం కోసం భారత్ తన అలీన విదేశాంగ విధానాన్ని అవలంబిస్తూ శాంతి స్థాపనకు కృషి చేయాలని ఆయన కోరారు. ప్రపంచ వ్యాప్తంగా శాంతిని ఆకాంక్షించే ప్రజానీకం అందరూ కలిసికట్టుగా ప్రపంచ శాంతి కై తమ ప్రభుత్వ విధానాల పై ఒత్తిడి చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్టీల్ సిఐటియు నాయకులు పి శ్రీనివాసరాజు, జి పుల్లారావు, బి మహేష్, డి ఎస్ వి ఎస్ శ్రీనివాస్, బి తౌడన్న, వి మురళి, దేవుడు నాయుడు, శ్రీనివాసరాజు, కె శ్రీనివాస్, సిహెచ్ వెంకట్రావు, మొహిద్దీన్, మధు, విడివి పూర్ణ చంద్రరావు, వివిధ విభాగాల అధ్యక్ష, కార్యదర్శులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన రైతన్నా మీకోసం-వారోత్సవాలు

వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్.




**నక్కపల్లి, పెన్ సత్తా, మార్చి 16:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతన్న మీకోసం వారోత్సవాలు సోమవారం నుండి ప్రారంభమయ్యాయని మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. కాగితలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉమాప్రసాద్ మాట్లాడుతూ మండలంలో11812 మంది రైతులకు అన్న దాత సుఖీభవ, పి ఎం కిసాన్ కలిపి రూ 6.33 కోట్లు లబ్ధి చేకూరిందన్నారు.అన్ని గ్రామాల్లో రైతన్నా మీకోసం- వారోత్సవాలు ఈనెల 16, 17 , 18, 23, 24, 25 తేదీలలో వ్యవసాయ శాఖ సిబ్బంది రైతులను కలిసి వ్యవసాయ సూచనలు ఇస్తూ అర్హత ఉండి లబ్ధి చేకూరని రైతులు జాబితా, ఫిర్యాదులను స్వీకరిస్తామన్నారు. దీనిలో భాగంగా ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు సూత్రాలు అయిన నీటి భద్రత, డిమాండ్ - ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్ పై వివరిస్తూ రైతులను ప్రోత్సహించడం జరిగిందన్నారు. ఈ ఏడాది ఎల్-నినో ప్రభావంతో కలిగే ఇబ్బందులపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్,ఏ ఈ ఓ సాయి , శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు ధనరాజు, మోహన్, అజయ్ ఆర్ ఎస్ కే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, వ్యవసాయ అనుబంధ సిబ్బంది ,రైతులు పాల్గొన్నారు.

## సజ్జల రామకృష్ణ రెడ్డి ని కలిసిన వైసీపీ రాష్ట్ర కార్యదర్శి పయిల శ్రీనివాసరావు



**విజయవాడ, పెన్ సత్తా, మార్చి 16:** తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గాల పరిశీలికలు సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, మాడుగుల నియోజకవర్గ పరిశీలకులు పయిల శ్రీనివాసరావు. అనంతరం పార్టీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసి పలు అంశాల పై చర్చించారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతం, నియోజకవర్గ స్థాయి పార్టీ కార్యకలాపాలు, ప్రజల సమస్యలు, భవిష్యత్తు కార్యక్రమాల పై సజ్జల రామకృష్ణ రెడ్డి తో పయిల శ్రీనివాసరావు విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. పార్టీని గ్రామ స్థాయిలో మరింత బలోపేతం చేయడానికి చేపట్టాల్సిన చర్యల పై కూడా సూచనలు పొందినట్లు చెప్పారు. అదే విధంగా మాడుగుల నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలు, నాయకులు, కార్యకర్తల సమన్వయం పై కూడా చర్చ జరిగినట్లు ఆయన వెల్లడించారు. పార్టీ శ్రేణులు మరింత ఐక్యంగా పని చేసి వైసీపీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు.

## సింహాచల వేద పాఠశాల విద్యార్థుల ఘనత

- తిరుపతి సదస్సులో విజయకేతనం.
- క్రమాంతం పరీక్షల్లో ఉత్తీర్ణత విద్యార్థులను సత్కరించిన ఈవో



**సింహాచలం, పెన్ సత్తా, మార్చి 16:**సింహాచల పుణ్యక్షేత్రం కేవలం భక్తికే కాదు, జ్ఞానసముపార్జనకు కూడా నిలయమని మరోసారి నిరూపిత మైంది.

వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన ఆధ్వర్యంలో నడుస్తున్న వేద ఆగమ పాఠశాల విద్యార్థులు జాతీయ స్థాయిలో తమ ప్రతిభను చాటి దేవస్థాన కీర్తిని దశదిశలా వ్యాప్తి చేశారు. తిరుపతిలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన వేంకటేశ్వర వేద విద్వత్ సదస్సు లో శుక్ల యజుర్వేద విభాగంలో సింహాచల, విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కఠిన మైన క్రమాంతం పరీక్షల్లో విజయాన్ని సాధించి దేవస్థానానికి కీర్తి తీసుకువచ్చారు. వేద ఆగమ పాఠశాలకు చెందిన విద్యార్థులు యశ్విక్, ఋషిక్, శివరాం, రాజేంద్ర కుమార్ ఈ పరీక్షల్లోఅత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించి, వేద విద్యలో తమ పట్టును నిరూపించుకున్నారు.

విజేత లైన విద్యార్థులు తమ గురువులు, శుక్ల యజుర్వేద పండితులు ఆర్.వి. రాజేష్ శర్మ తో కలిసి దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఛాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఈవో విద్యార్థులను అభినందిస్తూ వేద విద్యను అభ్యసిస్తూ విజయాన్ని సాధించడం గొప్ప విషయం అని ప్రశంసించారు. వారి ప్రతిభకు గుర్తింపుగా ఉత్తీర్ణత పత్రాలు (సర్టిఫికెట్లు) అందజేశారు. వేద రక్షణే ధర్మ రక్షణ. ఆధునిక కాలం లోనూ మన సనాతన ధర్మాన్ని, వేద విద్యను ఇంత నిష్ఠతో అభ్యసిస్తున్న ఈ విద్యార్థులు రేపటి సమాజానికి దిశానిర్దేశకులు అని కార్యనిర్వహణాధికారి అన్నారు.ఈ అభినందన కార్యక్రమంలో వేద పాఠశాల ప్రిన్సిపల్ శ్రీకాంతాచార్యులు, వేద పండితులు కపిలవాయి నరసింహ మూర్తి, గోదావరి సురేష్ శర్మ, ఘనపాఠి, అడ్మినిస్ట్రేషన్ ఏఈవో రమణమూర్తి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు. గురువుల పర్యవేక్షణ, దేవస్థాన యంత్రాంగం అందిస్తున్న సహకారం వల్లే విద్యార్థులు ఇలాంటి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తున్నారని, వేద విద్యలో సింహాచలం వేద ఆగమ పాఠశాల విద్యార్థులు సాధించిన ఈ విజయం దేవస్థానానికి గర్వకారణమని అధికారులు కొనియాడారు.

## పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలి...

- పోలీస్ అధికారులు,కోర్టు డ్యూటీ ఆఫీసర్స్ తో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు...

**పెన్ సత్తా, మార్చి 16:**జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు గల కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న ఎస్ హెచ్ ఓ లు,కోర్టు డ్యూటీ ఆఫీసర్లతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి బాధ్యతగా విధులు నిర్వర్తించాలని సూచించారు.న్యాయాధికారులతో సమన్వయం పాటిస్తూ పాత కేసుల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు.కేసుల పురోగతిని ఎప్పటికప్పుడు తమ అధికారులకు తెలియజేస్తూ ఉండాలని సూచించారు. ఏవైనా సందేహాలు తలెత్తితే డీసిఆర్బీ అధికారులకు తెలియజేసి వాటిని నివృత్తి చేసుకోవాలని తెలిపారు.కేసు నమోదయినప్పటి నుండి పరిష్కారం అయ్యే వరకు ప్రతీ విషయాన్ని ఆన్లైన్లో పొందుపరిచాలని టెక్ టీం ఆపరేటర్లకు సూచించారు.ఆన్లైన్లో పొందుపరిచే క్రమంలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఐటి సెల్ సహకారం తీసుకోవాలని అన్నారు.5ూ అమలులో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని,కేసులకు సంభందించిన ఫైళ్ళను క్రమపద్దతిలో అమర్చుకోవాలని సూచించారు. నేరస్తులకు శిక్ష పడే విధంగా కృషి చేసి బాధితులకు న్యాయం చేకూర్చడంలో ప్రతి ఒక్కరి పాత్ర కీలకమని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పీ ఆదినారాయణ,పాల్వంచ డిఎస్పీ సతీష్ కుమార్, మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు,డీసిఆర్బీ సీఐ శ్రీనివాస్,ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## తెలంగాణఅసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ:18000/- నిర్ణయించాలీ..

- సిఐటియు మండల కన్వీనర్ గడ్డం రమణారావు




**చింతకాని ,పెన్ సత్తా,మార్చి 16 ప్రతినిధి.** ఆశా వర్కర్లపై టార్గెట్ వేధింపుల అరికట్టాలి తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ చింతకాని మండల కన్వీనర్ గడ్డం రమణారావు తెలియజేశారు ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ:18000 నిర్ణయించాలీ అని ఈరోజు మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ కు వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కరించాలని అసెంబ్లీలో చర్చ పెట్టాలని ఆశ వర్కర్లు కోరారు.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కనీస వేతనం 18 వేల రూపాయలను వెంటనే అమలు చేయాలని ఈ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోనే ప్రకటించాలని పేదలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశ వర్కర్లకు సరిపడా నిధులు కేటాయించాలని. పెండింగ్ లో ఉన్న జనవరి ,ఫిబ్రవరి రెండు నెలల పారితోష్కాలను వెంటనే చెల్లించాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 28 వేల మంది ఆశా వర్కర్లు గత 20 సంవత్సరాలు నుండి పేద ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని వీరంతా మహిళలు, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారే అత్యధికలు ఉన్నారు కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు వైద్య సేవలు అందించారని తెలిపారు. ఆశా కార్యకర్తల యొక్క సేవలను గుర్తించి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ )ఆరోగ్య కార్యకర్తలను గ్లోబల్ లీడర్స్ గా అవార్డునందించిందని తెలిపారు.అనేక సేవలందిస్తున్న ఆశా కార్యకర్తలకు చట్టబద్ధ సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.కనీసం పక్క రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ లో మాదిరిగా ఫిక్స్ వేతనం ఇప్పటివరకు చేయలేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్న తన ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆశలకు కనీస వేతనం 18 వేల రూపాయలు అమలు చేస్తామన్న హామీ నేటికీ నెరవేరలేదన్నారు .50 లక్షల ఇన్సూరెన్స్ మట్టి ఖర్చులు ,రిటర్మెంట్ బెనిఫిట్స్ తదితర హామీలు ఇచ్చినప్పటికీ అవి హామీలుగానే మిగిలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు కొప్పుల కమల, దేవమ్మ, పి రాంభాయ్, బి మహాలక్ష్మి, కే నిర్మల, ఉష, సుజాత తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు

## సామాన్యుడిపై పెనుబారం-సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు



**,పెన్ సత్తా,మార్చి 16** సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో యుద్ధాలు ఆపాలని ప్రపంచ శాంతి వర్ధిల్లాలని... కేంద్ర ప్రభుత్వం గ్యాస్ కొరతలు నివారించాలని ప్రధాన రహదారిపై నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

ఆత్మకూరు మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు మాట్లాడుతూ పెట్టుబడి దారి సామ్రాజ్య వర్గమైన అమెరికా డోనాల్డ్ ట్రంప్ చేస్తున్న దాడులు నిలిపివేయాలని అన్నారు అనేక దేశాలపై దాడులకు సూత్రధారి అని ఉద్ఘాటించారు ఈ దాడుల నేపథ్యంలో ప్రధానంగా మనదేశంలో గ్యాస్ ,పెట్రోలియం లాంటి చుమురులకు తీవ్రమైన ఇబ్బందులు ఏర్పడుతున్నాయి అదేవిధంగా ఇక్కడ రైతులు పండించిన సరుకులు కూడా విదేశాల ఎక్స్పోర్ట్ నిలిచిపోయాయి దీనికి ప్రధానమైన కారణం ఈ దేశ ప్రధానమంత్రి మౌనమే దీనికి కారణం అని అన్నారు

ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి మజ్జిగ నరసయ్య , యాస బుచ్చిరెడ్డి, గుర్రం రాజమణి, సుల్తాన్ పురుషోత్తం,అంబోజు రాములు, దుర్గపతి నరసయ్య, మారుపాక యాదయ్య, ధనలక్ష్మి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన గ్రామ సర్పంచ్



**ఆత్మకూర్ యం: ,పెన్ సత్తా,మార్చి 16** ఆత్మకూరు మండల కేంద్రం రామ్ నగర్ కాలనీకి చెందిన చర్చి పాస్టర్ కొండపల్లి దావీదు గారి భార్య దీవెనమ్మ గుండెపోటుతో ఆకస్మిక మృతి చెందారు విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ బీసు ధనలక్ష్మి చందర్ గౌడ్

మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బీసు చందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి కొండపల్లి అబ్బ సాయిలు, జాలయ్య, బంగారి, సాంబ, యాదగిరి, లక్ష్మణ్, నరసింహా, అంజయ్య తదితరులు పాల్గొన్నారు

# అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగం ఎప్పటికి మరవరాదు

**యువత ఆ మహనీయుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి**

**జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్**



**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 16 :**ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని తెలుగు ప్రజలు ఎప్పటికి మరవరాదని బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ అన్నారు.యువత ఆ మహనీయుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని తమ లక్ష్యాలను సాధించేందుకు అహర్నిశలు కృషి చేయాలన్నారు.మార్చి 16 వ తేది సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి సందర్బంగా జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆయన చిత్ర పటానికి జిల్లా ఎస్పీ స్వయంగా పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ.....ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసి అసువులు బాసిన మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములు అని కొనియాడారు.1901 మార్చి 16 న ప్రస్తుత తమిళనాడులోని చెన్నై నగరంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జన్మించారన్నారు.చిన్నప్పటి నుంచే ఆయనలో సేవా భావం,దేశభక్తి,నిబద్ధత వంటి గొప్ప లక్షణాలు ఉన్నాయన్నారు.దేశ సేవ కోసం సుఖవంతమైన జీవితాన్ని వదిలిపెట్టారని తెలిపారు.స్వాతంత్ర్య సమరయోధుడిగా మారి,మహాత్మా గాంధీ ఆలోచనలతో ప్రభావితమై అహింసా మార్గంలో పోరాటం చేశారని అన్నారు.అప్పటిలో మద్రాస్ రాష్ట్రంలో ఉన్న తెలుగు మాట్లాడే ప్రాంతాన్ని ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రంగా ఏర్పాటు చేయాలన్న డిమాండ్ తో 1952 అక్టోబర్ 19 న మద్రాసులో ఆమరణ నిరాహార దీక్షకు పునుకున్నారన్నారు.58రోజుల పాటు పట్టు వీడవకుండా తన నిరాహార దీక్షను కొనసాగించి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరుడు అయ్యారని గుర్తు చేశారు.అనంతరం భాషా ప్రాతిపదికన ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు.ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పీ జగదీష్ నాయక్,డీసీఆర్బి ఇన్స్పెక్టర్ భుజంగరావు,ఎస్బి 2 ఇన్స్పెక్టర్ రాంబాబు,వెల్ఫేయిర్ ఆర్ఐ మౌలుద్దీన్,ఇతర పోలీస్ అధికారులు,డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

# అర్జీలు పునరావృతం కాకుండా సంతృప్తికర రీతిలో పరిష్కారించాలి



**బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్**

**జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం**

**బాపట్ల,పెన్ సత్తా,మార్చి 16 :**ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా సంతృప్తికర రీతిలో పరిష్కారించాలని బాపట్ల జిల్లా ఎస్పీ బి ఉమామహేశ్వర్ పోలీస్ అధికారులను ఆదేశించారు.సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు.వరకట్న వేధింపులు,కుటుంబ సమస్యలు,భూ వివాదాలు,ఆర్థిక లావాదేవీలు తదితర పలు సమస్యలతో మొత్తం 59 మంది అర్జీదారులు తమ సమస్యలను జిల్లా ఎస్పీకి విన్నవించుకున్నారు.జిల్లా ఎస్పీ అర్జీదారుల సమస్యలను కూలంకషంగా విని,వారి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి,నిర్దిష్ట గడువులోగా ఫిర్యాదిదారుల సమస్యలను పరిష్కారించాలని సంబంధిత పోలీస్ అధికారులను ఆదేశించారు.ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చే అర్జీలు పునరావృతం కాకుండా చట్ట పరిధిలో విచారించి సంతృప్తికర రీతిలో పరిష్కారించాలని పోలీస్ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ పీ.జగదీష్ నాయక్,పీజీఆర్ఎస్ సెల్ ఎస్ఐ లక్ష్మిరాజ్యం,ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి కి 125 దరఖాస్తులు



**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ,పెన్ సత్తా,మార్చి 16** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మాలతి అధికారులను ఆదేశించారు.సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల (125) దరఖాస్తులను డిప్యూటీ కలెక్టర్ మాలతితో కలిసి జిల్లా అధికారుల స్వీకరించారు. ఎంతో వ్యయ,ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి సుజాత, ఎఫ్ ఎ జి సెక్షన్ సూపరింటెండెంట్ విజయ్, ప్రాజెక్టు డైరెక్టర్ హౌసింగ్ రమణమూర్తి, డిఆర్డిఎ సాంబ శివ రావు,వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 15వ విడత అన్నదాన కార్యక్రమం

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద అన్నదానం
- ముఖ్యమంత్రి మాట తప్పకుండా ఈనెల 22న రైతు భరోసా నిధులు విడుదల చేయాలి
- గతంలో మాదిరిగా రైతు భరోసా నిధుల విడుదలలో కాలయాపన చేయొద్దు : ఇంద్రపాల భవాని

**,పెన్ సత్తా,మార్చి 16** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఈనెల 22న రైతు భరోసా నిధులు విడుదల చేయాలని తెలంగాణ రైతు పరిరక్షణ సమితి అధ్యక్షురాలు ఇంద్ర పాల భవాని డిమాండ్ చేశారు. గతంలో మూడుసార్లు ముఖ్యమంత్రి రైతు భరోసా నిధుల విడుదలలో విషయంలో మాట తప్పారని, ఈసారి మాట తప్పక రైతు భరోసా నిధులను విడుదల చేయాలని ఆమె కోరారు. తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మేడ్చల్ మల్కాజ్గిరి కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం 15వ విడత రైతు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ డిసెంబర్ మాసంలో విడతల కావలసిన రైతు భరోసా నిధులు మార్చి నెల వచ్చిన విడుదల కాకపోవడంతో సాగుకు పెట్టుబడి కోసం రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తూ అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులు విడుదల చేస్తామని మూడుసార్లు మాట ఇచ్చారని కానీ రైతు భరోసా నిధులు విడుదల కాలేదని తెలిపారు. వచ్చే బడ్జెట్లో రైతు సంక్షేమం కోసం పెద్ద ఎత్తున కేటాయించాలని భవాని కోరారు. అనంతరం తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఇంద్రపాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి అనేకమంది బాధితులు తమ సమస్యల పరిష్కారంకోసం వస్తుంటారని అటువంటి వారి కోసం ఎంతోకొంత సహకారం అందించాలని ఉద్దేశంతో ప్రతి సోమవారం తెలంగాణ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ప్రస్తుతం సుమారు 100 మంది వరకు అన్నదానం అందిస్తున్నామని దాతలు ముందుకు వచ్చి సహకరిస్తే మరి కొంతమందికి అన్నదానం అందిస్తామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో దావత్ అరుణ్, అంబాల విష్ణు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# చిన్నస్వామిలో ధనాధన్



## ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి

బెంగళూరు: ఎట్టకేలకు అనిశ్చితికి తెరపడింది. చిన్నస్వామి స్టేడియంలో 2026 ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణకు కర్ణాటక ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఐపీఎల్ ఈ నెల 28న ఆరంభం కానుంది. చిన్నస్వామి ఆతిథ్యమిచ్చే టోర్నీ తొలి మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తలపడనుంది. కర్ణాటక హోంమంత్రి పరమేశ్వర్ అధ్యక్షతన జరిగిన సమావేశం అనంతరం అక్కడ ఐపీఎల్ నిర్వహణకు అనుమతి లభించింది. సమావేశంలో నిపుణుల కమిటీ సభ్యులు.. కర్ణాటక క్రికెట్ సంఘం (కేఎస్‌సీఏ), ఆర్సీబీ ప్రతినిధులు పాల్గొన్నారు. నిపుణుల కమిటీలు సూచనలు, స్టేడియంలో ఏర్పాట్లను సమీక్షించాక ఐపీఎల్ నిర్వహణకు హోంమంత్రి అనుమతి ఇచ్చారని కేఎస్‌సీఏ అధికార ప్రతినిధి వినయ్ మృత్యుంజయ చెప్పాడు. బెంగళూరులో ఐపీఎల్ ప్రారంభోత్సవం కూడా జరగనుంది. తన ఏడు మ్యాచ్‌ల్లో అయిదింటిని చిన్నస్వామిలో, రెండింటిని రాయ్‌పుర్‌లో ఆడనున్నట్లు ఆర్సీబీ ఇంతకుముందు ప్రకటించింది. అయితే ఫైనల్, ఓ ప్లేఆఫ్ మ్యాచ్ కూడా బెంగళూరు స్టేడియంలోనే జరగనున్నట్లు తెలుస్తోంది. ఆర్సీబీ టైటిల్ సంబరాల సందర్భంగా నిరుడు స్టేడియం సమీపంలో జరిగిన తొక్కిసలాటలో 11 మంది మరణించారు. 30 మందికి పైగా గాయపడ్డారు. ఆ దుర్ఘటన అనంతరం చిన్నస్వామి స్టేడియంలో మ్యాచ్‌లు నిర్వహించడంపై కర్ణాటక ప్రభుత్వం నిషేధం విధించింది.

# భారత్ మూడు టీ20 జట్లను ఆడించగలదు



దిల్లీ: దేశంలో చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారని, టీ20ల్లో భారత్ ఒకే సమయంలో రెండు లేదా మూడు జట్లను బరిలోకి దించగలదని టీమ్ఇండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. 2024లో సూర్య టీ20 జట్టు పగ్గాలు అందుకున్నాక... టీమ్ఇండియా 52 మ్యాచ్‌ల్లో 42 గెలిచింది. ఇది పొట్టి ఫార్మాట్లో భారత్ ఆధిపత్యానికి నిదర్శనం. ఈ నేపథ్యంలోనే సూర్య స్పందించాడు. ప్రస్తుత టీ20 జట్టు.. భారత అత్యుత్తమ టీ20 జట్టని ఓ ఇంటర్వ్యూలో చెప్పాడు. "క్రమం తప్పకుండా ప్రతిభావంతులు వస్తూనే ఉన్నారు. ఐపీఎల్ దేశవాళీ క్రికెట్ నుంచి ప్రతి ఏటా ఎంతో మంది ఆటగాళ్లు దూసుకొస్తున్నారు. టీ20 క్రికెట్లో భారత్ ఎన్నంటే అన్ని జట్లను తయారు చేయొచ్చు. దేశంలో ప్రతిభావంతులకు లెక్కలేదు. రెండు మూడు తుది జట్లను బరిలోకి దించవచ్చు. భారత క్రికెట్ మూలాలు బలంగా ఉన్నాయి. నిజం చెప్పడానికి సిగ్గుపడాల్సిన అవసరం లేదు" అని సూర్య అన్నాడు. సమష్టి కృషి వల్లే టీ20ల్లో టీమ్ఇండియా ఎక్కువ విజయాలు సాధిస్తోందని చెప్పాడు.

# ఐపీఎల్ వచ్చేస్తోంది.. వేసవిలో వినోదం గ్యారెంటీ

## ఐపీఎల్ మరో 11 రోజుల్లో

నాలుగు వారాలపాటు అలరించిన టీ20 ప్రపంచకప్ ముగిసింది. అయితే క్రికెట్ అభిమానులు వినోదం కోసం వెతుక్కోవాల్సిన అవసరం లేదు. ధనాధన్ టోర్నీ దగ్గర్లోనే ఉంది. విధ్వంసక విన్యాసాలతో ఉర్రూతలూగించడానికి, ఉత్కంఠభరిత పోరాటాలతో ఊపేయడానికి ఐపీఎల్ వచ్చేస్తోంది. ఇంకో రెండు వారాలు కూడా లేదు. బ్యాట్లు విరిగేలా బాదేయడానికి బ్యాటర్లు.. అద్భుతమైన బౌలింగ్‌తో వాళ్లకు చెక్ పెట్టడానికి బౌలర్లు సిద్ధమవుతున్నారు. ఈ వేసవిలో అపరిమిత వినోదం గ్యారెంటీ!

**షెడ్యూలు కొన్ని మ్యాచ్‌లకే..**

ఐపీఎల్ 2026 కోసం బీసీసీఐ ఇంకా పూర్తి షెడ్యూలును ప్రకటించలేదు. తొలి 20 మ్యాచ్‌ల షెడ్యూలును మాత్రమే ఖరారు చేశారు. ఈ నెల 28న లీగ్ ఆరంభం కానుంది. అదే రోజు సొంతగడ్డపై డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌తో టైటిల్ వేటను ఆరంభిస్తుంది. ఆ తర్వాత రోజు వాంఖడే స్టేడియంలో ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడతాయి. రాష్ట్రాల ఎన్నికలు, అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మిగతా షెడ్యూలును రూపొందించే పనిలో ఉంది బీసీసీఐ. ఎన్నికల సంఘం ఆదివారం తమిళనాడు, అస్సాం, పశ్చిమ బెంగాల్, పుదుచ్చేరిల ఎన్నికల తేదీలను ప్రకటించిన నేపథ్యంలో ఐపీఎల్ పూర్తి షెడ్యూలును బోర్డు త్వరలోనే ఖరారు చేయనుంది.

**ధోనీకి ఇదే ఆఖరా?**

అంతర్జాతీయ క్రికెట్ నుంచి ఎప్పుడో రిటైరైనా ధోనీకి ఆకర్షణ మాత్రం తగ్గలేదు. అతడు రెండు మూడు బంతులాడినా అభిమానులు ఊగిపోతారు. కానీ 44 ఏళ్లు నిండిన అతడు ఇంకెంతకాలం ఆడతాడు? ధోనిలో వాడి తగ్గిందన్నది అందరూ అంగీకరించే విషయమే. ఐపీఎల్ నుంచి అతడు రిటైర్మెంట్‌పై గతంలో ఎన్నోసార్లు ఊహాగానాలు చెలరేగాయి. కానీ ధోని కెప్టెన్సీ వదిలేసి ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ఇప్పుడు కూడా అతడి రిటైర్మెంట్ చర్చనీయాంశంగా మారింది. ఇదే (2026) ధోని ఆఖరి ఐపీఎల్ అయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ముఖ్యంగా వికెట్‌కీపర్ బ్యాటర్ సంజు శాంసన్ చేరికతో తనపై భారాన్ని తగ్గించుకోవడానికి ధోనీకి అవకాశం దక్కింది. ధోనిని పసుపు జెర్సీలో చూడడం ఇదే చివరిసారి కావొచ్చని మాజీ ఆటగాళ్లు ఉతప్ప, ఇర్ఫాన్ పఠాన్ కూడా అభిప్రాయపడ్డారు. మైదానంలో తన పాత్రను ధోని మరింత తగ్గించుకుంటాడని ఉతప్ప అన్నాడు. మహి ఏడో స్థానంలో కూడా బ్యాటింగ్‌కు రాడని, ఎనిమిదో స్థానంలో రావొచ్చని చెప్పాడు.

## కృతి శెట్టి: బేబీ పింక్‌లో బాడీ - గ్లామ్ ఫోటోషూట్ & రైజింగ్ ఫిల్మ్ కెరీర్



# ఐకాన్ స్టార్ నుంచి గ్లోబల్ ఐకాన్ గా!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కెరీర్‌లో అత్యంత కీలకమైన దశలో ఉన్నారు. రాబోయే ఐదేళ్లలో ఆయన లైనప్‌లో ఉన్న సినిమాలన్నీ అనుకున్నట్లుగా విడుదలై బాక్సాఫీస్ వద్ద విజయం సాధిస్తే టాలీవుడ్ స్టార్‌గానే కాకుండా, భారతీయ చిత్ర పరిశ్రమలోనే అజేయమైన గ్లోబల్ ఐకాన్ గా ఎదిగే అవకాశం ఉంది. -పుష్ప-తో ఇప్పటికే పాన్-ఇండియా మార్కెట్‌ను శాసించిన బన్నీ, రాబోయే చిత్రాలతో తన ప్రభావాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడం ఖాయంగా కనిపిస్తోంది.వచ్చే ఐదేళ్లలో ఆయన లోకేష్ కనగరాజ్, సుకుమార్, త్రివిక్రమ్, సందీప్ రెడ్డి వంగా వంటి అగ్ర దర్శకులతో చేయబోయే సినిమాలు బాక్సాఫీస్ వద్ద వేల కోట్ల వరకు వసూళ్లను సాధించే అవకాశం ఉంది. అనుకున్నది అనుకున్నట్లు జరిగితే గనుక భారతీయ సినిమా చరిత్రలో అత్యధిక కమర్షియల్ స్టామినా ఉన్న హీరోగా బన్నీ నిలుస్తారు. ముఖ్యంగా హిందీ మార్కెట్‌లో బన్నీకి ఉన్న క్రేజ్ అమీర్ ఖాన్, షారుఖ్ ఖాన్ రేంజ్‌కు చేరుకోవడమే కాకుండా, సౌత్ నుంచి నార్త్ వరకు ఏకఛత్రాధిపత్యం వహించే మెగా పాన్-ఇండియా సూపర్ స్టార్ గా బన్నీ అవతరిస్తారు. సాంకేతికంగా , నటన పరంగా కూడా బన్నీ సరి కొత్త శిఖరాలను అధిరోహిస్తారు. త్రివిక్రమ్ సినిమాతో విజువల్ వండర్స్, సందీప్ వంగాతో రా అండ్ రస్టిక్ యాక్షన్ వంటి వైవిధ్యమైన జోనర్లు చేయడం వల్ల, ఆయన నటనలో ఉన్న అన్ని కోణాలు ప్రపంచానికి పరిచయమవుతాయి. ఇది కేవలం బాక్సాఫీస్ నంబర్లకే పరిమితం కాకుండా, గ్లోబల్ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌లు ,అంతర్జాతీయ చలనచిత్ర వేదికలపై భారతీయ సినిమాకు ప్రతినిధిగా అల్లు అర్జున్‌ని నిలబెడుతుంది. రాజమౌళి సినిమాల తర్వాత ఆ స్థాయి ప్రభావాన్ని చూపగల సత్తా ఉన్న హీరోగా బన్నీ పేరు మారుమోగిపోతుంది.

ఈ ఐదేళ్ల విజయ పరంపర అల్లు అర్జున్‌ను టాలీవుడ్ నెంబర్ వన్ స్థానంలో తిరుగులేని వ్యక్తిగా మార్చేస్తుంది. రికార్డులే కాకుండా, తనకంటూ ఒక సొంత సామ్రాజ్యాన్ని సృష్టించుకుని, భవిష్యత్ తరాల నటులకు ఒక రోల్ మోడల్‌గా నిలిచే అవకాశాలున్నాయి. 2030 నాటికి భారతీయ చిత్ర పరిశ్రమ గురించి ఎక్కడ చర్చ జరిగినా? అల్లు అర్జున్ పేరు మొదటి వరుసలో ఉండటం ఖాయం. ఆ విజయం ఆయనను కేవలం ఒక నటుడిగానే కాకుండా, సినిమా మార్కెట్‌ను శాసించే ఒక మహోన్నత శక్తిగా తీర్చిదిద్దుతుంది. ప్రస్తుతం బన్నీ తమిళ దర్శకుడు అట్లీతో కలిసి ఓ గ్లోబల్ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో బన్నీ మూడు-నాలుగు గెటప్స్ లో కనిపించ నున్నాడు? అన్న ప్రచారం సినిమాకు అంతకంతకు హైప్ తీసుకొస్తుంది. పాన్ వరల్డ్ లో ఈ చిత్రం వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది.

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com